Follow: @ANNTELUGU
10-06-2026
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 161 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జర్నలిస్ట్ కిషోర్ రెడ్డికి జగన్ ఫోన్

### యోగక్షేమాలపై ఆరా

**అమరావతి, మహా :** ఎఎన్ఎన్ ఏపీ స్టేట్ ఇన్ ఛార్జి, ఏపీ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు యరమల కిషోర్ రెడ్డితో మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. ఇటీవల కాలంలో కిషోర్ ప్రమాదానికి గురికాగా, పరిస్థితిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం కు చెందిన కిషోర్ తనయుడు యరమల సాయి దిలీప్ కుమార్ రెడ్డి వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలవగా, వెంటనే వీడియో కాల్ లో మాట్లాడిన జగన్, తనను కలవాలని సూచించారు. తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు.

టాప్ న్యూస్

## దేశ ద్రోహులకు భారతదేశం ధర్మశాల కాదు

యోగి ఆదిత్యనాథ్



03

## సాదాబైనామా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రి పొంగులేటి



03

## సన్నీ లియోన్‌కు షాక్

- రూ. 2,400 కోట్ల కుంభకోణంలో సీఐడీ నోటీసులు



02



## పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలు

- అల్లర్లలో 30 మందికిపైగా మృతి

02

## మరోసారి రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్

02

- భాగ్యనగరంలో నేపాలీ ముఠా కలకలం
- గచ్చిబౌలి విల్లాలో భారీ దోపిడీ
- కిలో బంగారం, వజ్రాల చోరీ



## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ వెనుక కాంగ్రెస్ నేతల హస్తం

- బీజేపీ మంత్రి కైలాశ్ సంచలన వ్యాఖ్యలు

02



## హైదరాబాద్ లో భారీ వర్షానికి ఇద్దరు బలి

- కరెంట్ తీగలు తెగిపడి..

03

# మీనాక్షిపై కుట్ర



### ఢిల్లీలోని ఈసీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

కాంగ్రెస్ అగ్రనేతలను గేటుబయటే అడ్డుకున్న ఈసీ భద్రతాసిబ్బంది

**అక్కడే రాత్రి బైఠాయించిన కేసీ వేణుగోపాల్, జైరాంరమేష్, భూపేష్ భగల్, సచిన్ పైలెట్**

అపుడు.. ఓట్ చోరీ.. ఇపుడు సీట్ చోరీ సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

ఈసీ, కేంద్రప్రభుత్వ తీరుపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రుల ధ్వజం



## రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

**హైదరాబాద్, మహా :** అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి సామ్రాజ్యాలను నిర్మించే తిమింగలాలపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ మరోసారి ఉక్కుపాదం మోపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్‌ఇన్‌చీఫ్ మోహన్ నాయక్ లక్ష్యంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు చేపట్టిన ముమ్మర సోదాలు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించాయి. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారం, వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగిన ఏసీబీ బలగాలు.. మోహన్ నాయక్ నిర్మించిన అక్రమ ఆస్తుల కోటల పునాదులను కదిలించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రభుత్వ అధికారి వెనకేసిన అక్రమాస్తుల విలువ ప్రభుత్వ మార్కెట్ ధరల ప్రకారం రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని తేలింది. నేటి కాలంలో అవినీతి అధికారులకు రూ.100 కోట్లు అనేది ఒక ఎంట్రీ లెవెల్ ప్యాకేజీ గా మారిపోయిందా అనేలా ఈ దాడుల సరళి సాగింది. హైదరాబాద్ మాధాపూర్‌లోని ఆయన

# మోహన్ నాయక్ @ రూ. 200 కోట్లు

### ఈ ఈఎన్ సీ అవినీతిలో చరిత్ర సృష్టించారు



- ఆర్ అండ్ బీ ఈఎన్ సీ మోహన్ నాయక్ ఆస్తులపై ఏసీబీ దాడులు
- ఏక కాలంలో 11 చోట్ల సోదాలు
- అక్రమాస్తులపై పక్కా ఆధారాలతో దాడులు చేసిన అధికారులు

02



## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు



### రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఇప్పటివరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష.

02

### మా అక్కలు పెట్టిన వాతలతో..

# కొందరు ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు

- కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తాం
- బస్సుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- జోరువర్షంలో.. కార్యక్రమానికి వచ్చిన సీఎం

02



## నేడు ఆదిలాబాద్‌కు డీజీపీ

- పలు ప్రారంభోత్సవాలు
- తోషం లో గ్రామ సభకు హాజరు

02





# మరోసారి రెచ్చిపోయిన నేపాలీ గ్యాంగ్

- భాగ్యనగరంలో నేపాలీ ముఠా కలకలం
- గచ్చిబౌలి విల్లాలో భారీ దోపిడీ
- కిలో బంగారం, వజ్రాల చోరీ

**హైదరాబాద్, మహా** : హైదరాబాద్ నగరంలో నేపాలీ ముఠా మరోసారి రెచ్చిపోయింది. నమ్మకంగా ఇళ్లల్లో చేరి సమయం చూసి యజమానుల ఆస్తులను దోచుకెళ్లే నేపాలీ గ్యాంగ్.. ఈసారి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక భారీ చోరీకి పాల్పడింది. గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాస్‌లో నివాసం ఉంటున్న ఒక ప్రముఖ వ్యాపారవేత్త ఇంట్లో ఈ దొంగతనం వెలుగు చూసింది. బాధితుడి ఇంట్లో నుంచి కిలో బరువున్న బంగారు ఆభరణాలు, అత్యంత విలువైన వజ్రాలను ఈ ముఠా అపహరించుకుపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం ఈ విల్లాలో నివాసముంటున్న వ్యాపారవేత్త నెల రోజుల క్రితమే నేపాల్ దేశానికి చెందిన దంపతులను ఇంట్లో వివిధ పనుల నిమిత్తం పనిలో పెట్టుకున్నారు. కొద్దిరోజుల క్రితం వ్యాపారవేత్త తన కుటుంబంతో కలిసి వ్యక్తిగత పనిమీద ముంబై నగరానికి వెళ్లారు. ఇదే సమయం కోసం ఎదురుచూస్తున్న నేపాలీ దంపతులు తమ ప్లాన్ అమలు చేశారు. ఆదివారం రోజున యజమాని కుటుంబం ముంబై నుంచి తిరిగి హైదరాబాద్‌లోని తమ నివాసానికి చేరుకుంది. వారు వచ్చేసరికి ఇంట్లో పనిమనుషులుగా ఉన్న నేపాలీ దంపతులు ఎక్కడా కనిపించలేదు. ఇంటి ప్రధాన ద్వారం తలుపులు గానీ, తాళాలు గానీ పగలగొట్టినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేక పోవడంతో.. యజమాని మొదట పెద్దగా అనుమానించలేదు. తమకు చెప్పకుండానే వారు పని మానేసి వెళ్లిపోయి ఉంటారని భావించారు. అయితే ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లి పూజ గదిని పరిశీలించగా అక్కడ విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు మాయమైనట్లు గుర్తించారు. దాంతో అనుమానం వచ్చి బెడ్‌రూమ్‌లోని లాకర్లను తనిఖీ చేయగా అందులో దాచిన కిలో బంగారం, వజ్రాభరణాలు కనిపించకుండా పోయాయి. ముందే తయారుచేసుకున్న డూప్లికేట్ కీస్ సహాయంతో లాకర్లు తెరిచి ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుడు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందాలు విల్లా పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో నేపాలీ ముఠాల నేరచరిత్ర కొత్తదేమీ కాదు. గతంలో కూడా ఇటువంటి తరహా ఘోర ఘాతుకానికి వీరు పాల్పడ్డారు. కొద్ది రోజుల క్రితం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్యను ఇదే తరహా నేపాలీ గ్యాంగ్ అత్యంత క్రూరంగా హతమార్చి దోపిడీకి ఒడిగట్టింది. ఇంట్లో నమ్మకంగా వంటమనిషిగా ఇతర పనుల కోసం చేరిన నేపాలీ వ్యక్తులు.. ఇంట్లో ఒంటరిగా ఉన్న సదరు ఐపీఎస్ భార్యపై దాడి చేసి ప్రాణాలు తీశారు. అనంతరం ఇంట్లోని నగదు, నగలతో నేపాల్ సరిహద్దులకు పారిపోయారు. ఈ తరహా ముఠాలు దొంగతనం చేసిన వెంటనే నేపాల్ దేశానికి పారిపోతుండటంతో వీరిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. అందువల్ల ఇళ్లల్లో నేపాలీ పనిమనుషులను పెట్టుకునేటప్పుడు వారి పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మీనాక్షిపై కుట్ర



( మొదటి పేజీ తరువాయి )

ప్రధాన నివాసంతో పాటు, మియాపూర్ పరిసర ప్రాంతాలు, నిజామాబాద్ జిల్లా సహా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 11 విభిన్న ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. మోహన్ నాయక్‌కు సంబంధించిన కార్యాలయాలు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, అత్యంత ఆప్తుల ఇళ్లలోనూ తనిఖీలు ముమ్మరంగా సాగాయి.

ఈ సోదాల్లో లభించిన అవినీతి సంపదను చూసి దర్యాప్తు అధికారులే విస్తుపోయారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న ప్రతి ఏసీబీ దాడిలోనూ సాధారణంగా కనిపించే భారీ నగదు, కిలోల కొద్దీ బంగారం, విలాసవంతమైన ఫార్మ్‌హౌస్‌లు, విలువైన ల్యాండ్ డాక్యుమెంట్లు, సీక్రెట్ లాకర్ల పర్వం ఇక్కడా పునరావృతమైంది. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు రూ.65 లక్షల నగదు, 2.5 కేజీల బంగారం, ఖరీదైన లగ్జరీ కార్లు, బినామీల పేరిట ఉన్న ఇళ్లు, స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వివిధ బ్యాంకు ఖాతాల వివరాలు, లాకర్ల కీలు, విదేశీ పెట్టుబడులకు సంబంధించిన కొన్ని అనుమానాస్పద డైరీలు, సేల్ డీడ్లను ఏసీబీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రోడ్లు, భవనాల శాఖలో అత్యంత ఉన్నత పొజిషన్‌లో ఉన్న మోహన్ నాయక్‌పై గత కొంతకాలంగా కాంట్రాక్టర్ల నుండి భారీగా కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. రాష్ట్రంలో జరిగే రహదారుల నిర్మాణం, ప్రభుత్వ భవనాల టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, కొన్ని నిర్దిష్ట ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఆయన ఈ అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుల అప్రూవల్స్, కాంట్రాక్ట్ ఎగ్జిక్యూషన్లలో ఆయనకున్న అపరిమితమైన అధికారమే ఈ స్థాయి అవినీతికి మార్గం సుగమం చేసిందని దర్యాప్తులో ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి ఇంత పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని లూటీ చేసి ఆస్తులు కూడబెట్టడం వెనుక ఎవరెవరి హస్తం ఉందనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. పట్టుబడిన ఆస్తుల లెక్కలు, ల్యాండ్ డాక్యుమెంట్ల విలువలు మార్కెట్ రేటు ప్రకారం చూస్తే వందల కోట్లలోనే తేలే అవకాశం ఉండటంతో.. పూర్తి వివరాలను క్రోడీకరించి, సమగ్ర నివేదికను రూపొందించడానికి మరింత సమయం పడుతుందని ఏసీబీ ఉన్నతాధికారులు వెల్లడించారు

# మోహన్ నాయక్ @రూ. 200 కోట్లు



**హైదరాబాద్, మహా :** అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి సామ్రాజ్యాలను నిర్మించే తిమింగలాలపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ మరోసారి ఉక్కుపాదం మోపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్‌ఇన్‌చీఫ్ మోహన్ నాయక్ లక్ష్యంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు చేపట్టిన ముమ్మర సోదాలు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించాయి. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారం, వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగిన ఏసీబీ బలగాలు.. మోహన్ నాయక్ నిర్మించిన అక్రమ ఆస్తుల కోటల పునాదులను కదిలించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రభుత్వ అధికారి వెనకేసిన అక్రమాస్తుల విలువ ప్రభుత్వ మార్కెట్ ధరల ప్రకారం రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని తేలింది. నేటి కాలంలో అవినీతి అధికారులకు రూ.100 కోట్లు అనేది ఒక ఎంట్రీ లెవెల్ ప్యాకేజీ గా మారిపోయిందా అనేలా ఈ దాడుల సరళి సాగింది. హైదరాబాద్ మాధాపూర్‌లోని ఆయన ప్రధాన నివాసంతో పాటు, మియాపూర్ పరిసర ప్రాంతాలు, నిజామాబాద్ జిల్లా సహా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 11 విభిన్న ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. మోహన్ నాయక్‌కు సంబంధించిన కార్యాలయాలు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, అత్యంత ఆప్తుల ఇళ్లలోనూ తనిఖీలు ముమ్మరంగా సాగాయి.

ఈ సోదాల్లో లభించిన అవినీతి సంపదను చూసి దర్యాప్తు అధికారులే విస్తుపోయారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న ప్రతి ఏసీబీ దాడిలోనూ సాధారణంగా కనిపించే భారీ నగదు, కిలోల కొద్దీ బంగారం, విలాసవంతమైన ఫార్మ్‌హౌస్‌లు, విలువైన ల్యాండ్ డాక్యుమెంట్లు, సీక్రెట్ లాకర్ల పర్వం ఇక్కడా పునరావృతమైంది. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు రూ.65 లక్షల నగదు, 2.5 కేజీల బంగారం, ఖరీదైన లగ్జరీ కార్లు, బినామీల పేరిట ఉన్న ఇళ్లు, స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వివిధ బ్యాంకు ఖాతాల వివరాలు, లాకర్ల కీలు, విదేశీ పెట్టుబడులకు సంబంధించిన కొన్ని అనుమానాస్పద డైరీలు, సేల్ డీడ్లను ఏసీబీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రోడ్లు, భవనాల శాఖలో అత్యంత ఉన్నత పొజిషన్‌లో ఉన్న మోహన్ నాయక్‌పై గత కొంతకాలంగా కాంట్రాక్టర్ల నుండి భారీగా కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. రాష్ట్రంలో జరిగే రహదారుల నిర్మాణం, ప్రభుత్వ భవనాల టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, కొన్ని నిర్దిష్ట ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఆయన ఈ అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. ప్రాజెక్టుల అప్రూవల్స్, కాంట్రాక్ట్ ఎగ్జిక్యూషన్లలో ఆయనకున్న అపరిమితమైన అధికారమే ఈ స్థాయి అవినీతికి మార్గం సుగమం చేసిందని దర్యాప్తులో ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి ఇంత పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని లూటీ చేసి ఆస్తులు కూడబెట్టడం వెనుక ఎవరెవరి హస్తం ఉందనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. పట్టుబడిన ఆస్తుల లెక్కలు, ల్యాండ్ డాక్యుమెంట్ల విలువలు మార్కెట్ రేటు ప్రకారం చూస్తే వందల కోట్లలోనే తేలే అవకాశం ఉండటంతో.. పూర్తి వివరాలను క్రోడీకరించి, సమగ్ర నివేదికను రూపొందించడానికి మరింత సమయం పడుతుందని ఏసీబీ ఉన్నతాధికారులు వెల్లడించారు.



## సన్నీ లియోన్‌కు షాక్

- రూ. 2,400 కోట్ల కుంభకోణంలో సీఐడీ నోటీసులు

**ఢిల్లీ, మహా :** కర్ణాటక కేంద్రంగా సాగిన ఈ వందల కోట్ల మాయాజాలంలో సీఐడీ సన్నీలియోన్ కు నోటీసులిచ్చింది. కర్ణాటకకు చెందిన శివమ్ అసోసియేట్స్ అనే సంస్థ అధిక వడ్డీలు, ఆకర్షణీయమైన పథకాల పేరుతో అమాయక ప్రజలకు గాలం వేసింది. నమ్మకాన్ని పెట్టుబడిగా మలచుకుని ఏకంగా రూ.2,400 కోట్ల మేర అక్రమ డిపాజిట్లు సేకరించి, దారుణంగా మోసం చేసింది. ఈ భారీ మోసానికి సూత్రధారి, సంస్థ అధినేత శివానంద నీలణ్ణవర్. అడ్డదారిలో సంపాదించిన ఈ అపారమైన నల్లధనాన్ని అతడు సినీ రంగం వైపు మళ్లించినట్లు స్పష్టమవుతోంది. తన అక్రమ సామ్రాజ్యానికి వెండితెర గ్లామర్‌ను అద్దే ప్రయత్నంలో భాగంగా 2023లో 'ఛాంపియన్' అనే చిత్రాన్ని నిర్మించాడు. ఈ సినిమా ద్వారానే సన్నీ లియోన్ ఈ వివాదంలోకి ప్రవేశించింది. ఛాంపియన్ సినిమాలో ఒక ప్రత్యేక గీతంలో (ఐటెం సాంగ్) నర్తించేందుకు సన్నీ లియోన్‌ను సంప్రదించిన శివానంద.. ఆమెకు పారితోషికంగా ఏకంగా కోటి రూపాయలు చెల్లించినట్లు సీఐడీ అధికారుల దర్యాప్తులో, బ్యాంక్ లావాదేవీల రికార్డుల ద్వారా బట్టబయలైంది. సన్నీ లియోన్‌కు చెల్లించిన ఆ భారీ పారితోషికం.. సామాన్య ప్రజల నుంచి వసూలు చేసిన అక్రమ సొమ్ము నుంచే ఇచ్చారా? అనే కీలక కోణంలో ఇప్పుడు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ ఆర్థిక లావాదేవీల వ్యవహారంపై పూర్తి స్థాయి వివరణ ఇవ్వాలంటూ కర్ణాటక సీఐడీ అధికారులు ఆమెకు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. బ్యాంకు ఖాతాల వివరాలతో సహా విచారణకు సహకరించాలని అందులో పేర్కొన్నట్లు సమాచారం. సప్తమీ గౌడ, వశిష్ఠ సింహ, రాగిణి ద్వివేదిలకు కూడా నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. వీరందరూ ఆ ఉత్సవానికి ఎలా హాజరయ్యారు? వారికి అందిన పారితోషికం ఎంత? తదితర వివరాలను రాబట్టేందుకు విచారణాధికారులు సన్నద్ధమవుతున్నారు.

# నేడు ఆదిలాబాద్‌కు డీజీపీ

- పలు ప్రారంభోత్సవాలు
- తోషం లో గ్రామ సభకు హాజరు



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ బుధవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9:30 గంటలకు జిల్లా పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ సమావేశంలో పాల్గొంటారు. 11:30 గంటలకు ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ ఎంటి సెక్షన్ లో నూతనంగా హైడ్రాలిక్స్ ను, 11:40 కి పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్ లో చిల్డ్రన్ పార్క్ ను ప్రారంభిస్తారు. 11:45 గంటలకు డిపిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ , అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ చౌరస్తా లో ట్రాఫిక్ సిగ్నల్స్ ను ప్రారంభిస్తారు. అనంతరం గుడిహత్నూర్ మండలం తోషం గ్రామాన్ని సందర్శిస్తారు. అక్కడ ప్రజా పాలనలో భాగంగా నిర్వహించే గ్రామసభ లో పాల్గొంటారు. అనంతరం తోషం గ్రామంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం లో పాల్గొంటారు. యువతకు హెల్మెట్స్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో యువతకి లర్నింగ్ లైసెన్స్ అందజేస్తారు. వర్షాకాలం దృష్ట్యా జిల్లా విపత్తు నిర్వహణ కు సంబంధించిన నూతన పరికరాల అందజేస్తారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో అత్యవసర పరిస్థితుల్లో జరిపే సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆటో డ్రైవర్లకు ప్రథమ చికిత్స కిట్స్ అందజేస్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు ఆదిలాబాద్ హెడ్ క్వార్టర్స్ లో మీడియా సమావేశం లో పాల్గొంటారు.

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ వెనుక

# టీ కాంగ్రెస్ నేతల హస్తం

**బీజేపీ మంత్రి కైలాశ్ సంచలన వ్యాఖ్యలు**

**మహా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్‌లో వేసిన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి కైలాష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందంటూ మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి బాంబు పేల్చారు. తెలంగాణలో మీనాక్షిపై క్రిమినల్ కేసు నమోదైందని, ఆమె ఈ విషయాన్ని అఫిడవిట్‌లో మెన్షన్ చేయలేదని ఈసీకి బీజేపీ ఇచ్చిన ఫిర్యాదుతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే దీనిపై బీజేపీ మంత్రి కైలాష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీనాక్షి నటరాజన్ మీద ఉన్న కేసు వివరాలను తెలంగాణ కాంగ్రెస్ నాయకులే తమకు అందించారని చెప్పారు. తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని, అలాంటప్పుడు ఆమె కేసు వివరాలు మా దాకా ఎలా వస్తాయని కైలాశ్ ప్రశ్నించారు. తెలంగాణ నుంచే కేసు వివరాలు వచ్చాయన్నారు. కైలాశ్ వ్యాఖ్యలు బీజేపీ మాహమా.. నిజమా అనుదానిపై పారీవరాలు ఆరాతీసునాయి.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం.
- ఇప్పటివరకు 75 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ.
- సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష.

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో అన్నదాతల శ్రమకు తగిన గుర్తింపునిస్తూ, ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఏకంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన తాజా సమీక్షా సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ధాన్యం సేకరణపై కీలక వివరాలను వెల్లడించారు.

**కేంద్రం ఆంక్షలున్నా వెనక్కి తగ్గని రాష్ట్ర సర్కారు**

ధాన్యం సేకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం పెట్టిన పరిమితులను సైతం లెక్కచేయకుండా రాష్ట్రప్రభుత్వం రైతుల పక్షాన నిలబడటం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం యాభై రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం స్పష్టం చేసినప్పటికీ, రైతులు నష్టపోకూడదన్న ఏకైక ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అదనపు ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రైతుల కష్టాన్ని దళారులు దోచుకోకుండా ఉండేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల ఐదు వందల డెబ్బై ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, పకడ్బందీగా సేకరణ ప్రక్రియను పర్యవేక్షించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. మారుమూల గ్రామాల రైతులకు సైతం రవాణా ఇబ్బందులు లేకుండా ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

ఇప్పటికే డెబ్బై ఐదు లక్షల మెట్రిక్ టన్నుల మార్కును చేరుకున్న పౌరసరఫరాల శాఖ, మిగిలిన ధాన్యాన్ని కూడా సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రానున్న వారం రోజుల్లో అదనంగా మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ధాన్యం విక్రయించిన రైతులకు ఏమాత్రం జాప్యం జరగకుండా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిచిపోకుండా వెంటనే గోదాములకు, రైస్ మిల్లులకు తరలించేందుకు రవాణా వ్యవస్థను మరింత వేగవంతం చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకూ కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఏ ఒక్క రైతూ దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని ఈ సమీక్ష ద్వారా స్పష్టమవుతోంది.

## నేడు చెన్నూరు నియోజకవర్గానికి కార్మిక శాఖ మంత్రి రాక

**మందమర్రి, మహా :** నేడు చెన్నూరు నియోజకవర్గానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేకానంద రానున్నారు. ఉదయం 10.30 నిమిషాలకు మందమర్రి ఏరియా సింగరేణి ఇల్లందు క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జర్మనీ భాష శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో బద్ధి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు భీమారం మండల కేంద్రంలో నేరాల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాలు ప్రారంభోత్సవం చేయనున్నారు. తధానంతరం రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు చెన్నూరు లోని (పాత వ్యవసాయ మార్కెట్ కార్యాలయం) నూతన బస్తీ దవాఖాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని కాంగ్రెస్ మందమర్రి పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి వెల్లడించారు. చదువుకున్న యువతీ, యువకులకు ఈ శిక్షణ ఒక సువర్ణ అవకాశమని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## మా అక్కలు పెట్టిన వాతలతో..

# కొందరు ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు



**హైదరాబాద్, మహా :** మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

**ఆటోడ్రైవర్లను రెచ్చగొట్టారు..**

కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని, ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**కోటీశ్వరులుగా చేస్తాం**

కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదాతరులు పాల్గొన్నారు.



# దేశ ద్రోహులకు భారతదేశం ధర్మశాల కాదు

**యోగి ఆదిత్యనాథ్**



**లక్నో, మహా :** దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లక్నోలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు. 'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృతమవుతుందని అన్నారు. దేశంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రామాయణ కాలంలో కూడా ఖాళీగా ఉన్న భూములను మారీచుడు, ఖరదూషణాది రాక్షసులు దురాక్రమణ చేసేవారని, ల్యాండ్ జిహాద్‌కు పాల్పడేవారని అన్నారు. ప్రతి యుగంలోనే దుష్టశక్తులు ఉంటాయని, అయితే సత్యం, మతం పరిరక్షణకు శ్రీరాముడు ఏవిధంగా పాటుపడ్డారో అందరూ తెలుసుకుని కర్తవ్యబద్ధులుకావాలని, అంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

# జగన్ బాటలో విజయ్

**దిశ తరహాలో సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు**




చెన్నై, మహా : తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నెల రోజులకు విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల రక్షణ కోసం సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. గతంలో వైఎస్ జగన్ మహిళలకోసం తీసుకొచ్చిన దిశ చట్టం, పోలీస్ స్టేషన్ల తరహాలో మరింత ఆధునికంగా ఈ నూతన వ్యవస్థకు విజయ్ శ్రీకారం చుట్టారు. తమిళనాడులో శాంతి భద్రతలపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ.. మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సీఎం విజయ్ కీలక ముందడుగు వేశారు. సెంగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. తమిళనాడు సీఎంగా ప్రమాణం చేసిన సరిగ్గా నెల రోజులకు విజయ్ ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించడం విశేషం. స్త్రీలు, బాలికల భద్రత కోసం ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ విభాగం పని చేస్తుంది. సింగప్పెన్ అంటే తమిళంలో సింహం లాంటి అమ్మాయి అని అర్థం. ఈ టాస్క్‌ఫోర్స్ విభాగంలో కానిస్టేబుల్ నుంచి ఐజీ స్థాయి వరకు అందరూ మహిళా పోలీసులే ఉంటారు. ఈ విభాగంలో పని చేసే వారికి మార్షల్ ఆర్ట్స్‌తోపాటు ఆయుధాల వినియోగం, బైక్ నడపడంపై శిక్షణ ఇస్తారు. మహిళలపై వేధింపులు జరిగే కాలేజీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు లాంటి రద్దీ ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా నేరాలు జరగకుండా ఈ టాస్క్‌ఫోర్స్ చూస్తుంది. ప్రత్యేకమైన యూనిఫామ్‌లో సింగప్పెన్ మహిళా పోలీసులు బైకులపై రోడ్ల మీద తిరుగుతుంటారు. దీని వల్ల ఆకతాయిలు భయపడతారు. మహిళలు స్వేచ్ఛగా సంచరించడానికి అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వీరు మఫ్టీలో సాధారణ మహిళల్లా తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో పని చేసే వారికి బాడీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్ వాహనాలను అందిస్తారు. మహిళా హెల్ప్ లైన్ నంబర్లు లేదా అత్యవసర కాల్ నంబర్‌కు వచ్చే కాల్స్‌ను ఈ టాస్క్‌ఫోర్స్ కంట్రోల్ రూమ్ నిరంతరం పర్యవేక్షిస్తుంది. సింగప్పెన్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించిన సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. 'ఈ టాస్క్‌ఫోర్స్ నా హృదయానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. తమిళనాడులోని ప్రతి కుటుంబాన్ని రక్షించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది. మహిళల రక్షణకు, మన కుటుంబాల భద్రతకు కట్టుబడి ఉన్నాం. ఇది కేవలం ఎన్నికల హామీ కాదు.. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించడం ద్వారా కీలక ముందడుగు వేశాం. డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ అనే మూడు అంశాలపై మా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. తమిళనాడును పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చాలి. గతాన్ని తవ్వుకుంటూ కూర్చోవాలని మేం అనుకోవడం లేదు. సురక్షిత భవిష్యత్తును అందించడంపైనే మా ఫోకస్ ఉంది. మహిళలపై నేరాలను ఏమాత్రం సహించబోం. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తాం. ఆ శిక్షలు చూశాక, నేరాలు చేయాలంటే ఇతరులు భయపడేలా చేస్తాం' అని విజయ్ వ్యాఖ్యానించారు.

# పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో నిరసనలు

**- అల్లర్లలో 30 మందికిపైగా మృతి**

**మహా :** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మరోసారి నెత్తురోడింది. స్థానిక అవామీ యాక్షన్ కమిటీ జాక్ పై నిషేధానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న పౌరులపై పాక్ సైన్యం మంగళవారం కాల్పులు జరిపింది. దీనితో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో పలువురు భద్రతాసిబ్బంది సహా మొత్తం 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, 200 మంది వరకు గాయాల పాలు అయ్యారని పాక్ ప్రభుత్వం తెలిపింది. అయితే మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, పాక్ ప్రభుత్వం కావాలనే వివరాలను బయటకు రానివ్వడం లేదని జాక్ తో పాటు స్థానికులు ఆరోపిస్తున్నారు.



# సాదాబైనామా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, మహా :** గత ప్రభుత్వ ధరణి లోపాల వల్ల రాష్ట్రంలో నిలిచిపోయిన సాదాబైనామా భూ సమస్యలకు తమ ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్‌లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సాదాబైనామా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటిని ధరణి చట్టంలో పొందుపరచకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే 'భూ భారతి' చట్టంలో సాదాబైనామాను చేర్చి, హైకోర్టులో ఉన్న కేసును పరిష్కరించి రైతులకు ఊరట కల్పించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో ఇప్పటికే 5.5 లక్షలకు నోటీసులు జారీ చేసినట్లు, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసులు అందజేస్తామని మంత్రి చెప్పారు. 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన వారికి పూర్తి పట్టాదారు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా పని చేయాలి

**భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జూన్ 9 మహా**
సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా జిల్లా అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పలువురు ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు ఎంపీ చామల కిరణ్ రెడ్డి గారికి వివిధ శాఖల అధికారులు నివేదికలు వారి పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు . ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నందున సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలని, అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు పెద్ద ఎత్తున ప్రచారం చేసి అవగాహన కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా శాఖల్లో అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు సద్వినియోగం అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలనిఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్స్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో భారీ వర్షానికి ఇద్దరు బలి

**. కరెంట్ తీగలు తెగిపడి..**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం నమోదైంది. ఈ వర్షానికి నగరంలోని అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈదురుగాలులకు చెట్లు విరిగి పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నాలెడ్జ్ సిటీ నుంచి 11 కిలోమీటర్ల గమ్యం చేరుకోవడానికి ఏకంగా గంటన్నరకు పైగా గూగుల్ మ్యాప్ లో చూపించడంతో వాహనదారులు కంగు తిన్నారు. ఇక కూకట్ పల్లి, కేపీహెచ్ బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రామ్ నగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం నమోదైంది. ప్రజలు వర్షంలోనే తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఇద్దరు యువకులు బలయ్యారు. పాతబస్తీలోని బండ్లగూడలో జాఫర్(25), అబూ(16) అనే ఇద్దరు యువకులు అప్పుడే ఆటో దిగి నీటిలో అడుగుపెట్టిన వెంటనే విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందారు. వర్షం కారణంగా అప్పటికే కరెంట్ తీగలు తెగిపడి నీటిలో పడినట్లు తెలుస్తోంది. ముందస్తు జాగ్రత్తలు లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నారు. మరోవైపు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. మరోవైపు ఛత్తా బజార్ లో రోడ్డుపై కమాన్ కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం, ఆస్తినష్టం తప్పింది.

# పేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉంది



**దమ్మపేట ,మహా :** పేదల సంక్షేమం ,ప్రభుత్వ అభివృద్ధి రెండు కళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండలంలో మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాలైన పూసుగూడెం, కట్కూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. కట్కూరు గ్రామంలో అందరికీ ఇళ్లు రాలేదని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, రెండో విడతలో అందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు. పూసుగూడెం గ్రామస్తులు వినతులు అందించగా, స్పందించిన మంత్రి సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని, పోడు రైతుల సమస్యలపై రెవెన్యూ, అటవీ శాఖలతో జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. అలాగే పూసుగూడెం రహదారి పనులు వేగవంతం చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. అనంతరం పట్వారిగూడెం నుంచి పాకలగూడెం వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రైతు వేదికలో రాచూరుపల్లి, మల్లారం, లచ్చాపురం గ్రామాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. ఆ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 1.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ నగరానికి ప్రత్యేకంగా లక్ష ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు.

# కాంగ్రెస్ టిఆర్ఎస్ ప్రజలను మోసగిస్తున్నారు...

**రామచంద్రరావు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు**



**యాదాద్రి భువనగిరి జూన్ 9 మహా** అవినీతి అక్రమాలలో కాంగ్రెస్, బిఆర్ఎస్ లు పరస్పరం సహకరించుకుంటూ నాటి నుంచి నేటి వరకు ప్రజలను మోసగిస్తున్నారని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఊభువనగిరిఢ్ మండలం సురేంద్రపురి వాసవి నిత్య అన్నదాన సత్రంలో బిజెపి రాష్ట్ర కార్యకర్తల శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం జిల్లా పార్టీ అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ల తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని ఇటలీ సోనియా కుటుంబానికి ఏటీఎం గా మారిందని విమర్శించారు. దేశానికి కాంగ్రెస్ పార్టీ కుటుంబం పాలన మాత్రమే సాగాల అని దుయ్యబట్టారు.దేశం కోసం ప్రాణాలు అర్పించే పార్టీ బిజెపి అని, ఓ బి సి నాయకుడు నరేంద్ర మోడీ ప్రధానిగా దేశం అన్ని రంగాలలో ముందుకు సాగుతుంటే జీర్ణించుకోని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు అన్నారు . తెలంగాణ రాష్ట్రం కోసం 13 లక్షల కోట్ల రూపాయలతో అనేక ప్రాజెక్టులు కంపెనీలు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర నాయకులకు కళ్ళు కనపడటం లేదా అని మండిపడ్డారు. బిజెపి ఎంపీ, ఎమ్మెల్యేలు,నాయకులపై అవాక్కులు చివాకులు పేలుతే సహించేలేదని, రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలులో పూర్తి విఫలమై రైతాంగానికి ఇవ్వవలసినది ఏవి ఇవ్వకుండా బిజెపి పై లేనిపోనివి కల్పించి మాట్లాడితే, ఇతర రైతాంగ హామీలు అమలు చేయని కాంగ్రెస్ నాయకులు రోడ్డు ఎక్కే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ట్రిబుల్ ఆర్ కు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, జిహెచ్ఎంసి ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ మెట్రో విషయంలో తప్పుడు ప్రచారం చేస్తూ తగదన్నారు. మెట్రో విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అన్ని విషయాల్లో సహకరిస్తున్నట్లు చెప్పారు.

# తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న బీర్ల అయిలయ్య దంపతులు

**యాదాద్రి భువనగిరి జూన్ 9 మహా :** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం కుటుంబ సమేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు చేశారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ...రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలేరు నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు.అలాగే ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేసేలా స్వామి వారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు.

# అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**భద్రాద్రి బ్యూరో, మహా:** పేదల సంక్షేమం అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి అశ్వారావుపేట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సన్నబియ్యం కొత్త రేషన్ కార్డులు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కేవలం తొమ్మిది నెలల్లోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల వ్యయంతో రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి ప్రత్యేకంగా 4,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. కుల మత పార్టీ భేదాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని రెండో విడతలో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ప్రతి అర్హుడికి ఇల్లు అందే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను ఆపకుండా కొనసాగిస్తున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టామని 99 పాఠశాలల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయిస్తామని చెప్పారు.మారుమూల గిరిజన ప్రాంతాలైన పూసుకుంటలో కొండ రెడ్లు గుత్తి కోయలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు నిర్వహించడం ద్వారా పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి నర్సింగ్ కళాశాల ఏటీ సి కళాశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో స్థల సమస్య ఉన్నప్పటికీ ఐదు ఎకరాల్లో గ్రౌండ్ ప్లస్ త్రీ విధానంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి స్థలం లేని పేదలకు అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించడం జరిగిందన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించనున్నాయని తెలిపారు. అత్యాధునిక తరగతి గదులు హాస్టళ్లు క్రీడా ప్రాంగణాలు లైబ్రరీలు ఇతర సౌకర్యాలతో ఈ పాఠశాలలు నిర్మించబడుతున్నాయని చెప్పారు. ఈ పాఠశాలలు అందుబాటులోకి వస్తే ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటకు మడమ తిప్పకుండ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 129 ఎకరాల్లో కొమరం భీమ్ అర్బన్ ఎకో పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. దొంతికుంట చెరువు ఆధునికీకరణకు రూ.5.70 కోట్లతో పనులు చేపడుతున్నామని పూసుకుంట వంటి గిరిజన ప్రాంతాల్లో 100 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. విశాలమైన తరగతి గదులు ఆధునిక ప్రయోగశాలలు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు క్రీడా ప్రాంగణాలు హాస్టల్ వసతులు కిచెన్ డైనింగ్ హాల్ లైబ్రరీ వంటి అన్ని సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అన్ని శాఖల సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అశ్వారావుపేట నియోజకవర్గ విద్యారంగ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, అశ్వారావుపేట మునిసిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, ఆత్మ కమిటీ చైర్మన్, ప్రజాప్రతినిధులు, నిర్మాణ శాఖ పి డి సావేరామ్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హిట్లర్... హీట్...

హిట్లర్... హిట్లర్... హిట్లర్... ఇప్పుడు ఈ పేరు హిట్ అయింది... అంతే కాదు... హాట్ టాపిక్ కూడా అయింది... కాస్త చరిత్ర తెలిసిన వాళ్ళు అయితే హిట్లర్ పేరు ఇప్పుడు మళ్ళీ ఎందుకు ప్రచారంలోకి వచ్చిందని ఆలోచిస్తుంటే ఆయన గురించి తెలియని ఆధునిక యువత మాత్రం ఇది ఆ మధ్య కాలంలో వచ్చిన మెగా స్టార్ చిరంజీవి సినిమా పేరు అనుకుంటున్నారు... అప్పుడెప్పుడో వచ్చిన హిట్లర్ సినిమా గురించి ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడుతున్నారు అని అనుమానం వ్యక్తం చేసే నవ యువత కూడా లేకపోలేదు... అసలు సీఎం రేవంత్ హిట్లర్ పేరు ఎందుకు వాడారు... అది అయోచితంగా నోటి నుంచి వచ్చేసిందా? లేకపోతే హిట్లర్ పోకడ రేవంత్ ను మెప్పించిందా? అని సందేహ పడే వారు లేకపోలేదు. ఏదిఏమైనా సీఎం రేవంత్ రెడ్డి హిట్లర్ పేరు ప్రస్తావనకు తెచ్చి తెలంగాణలో ఓ రాజకీయ హిట్ పుట్టించారు... ఇదే ఇప్పుడు తెలంగాణ పార్టీలకు ఓ ఆయుధం అయింది... అదిగో రేవంత్ రెడ్డి హిట్లర్ పోకడలు పోతున్నారు... అది ఆయనే స్వయంగా చెప్పేసారు... ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం కాదు... హిట్లర్ పాలన... అంటూ విపక్షాలు విరుచుకు పడుతున్నాయి... అసలు ఏ సమయంలో ఏ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నియంత అయిన హిట్లర్ పేరు వాడారు? అనేది ఇప్పుడు పక్కన పెట్టేసారు... అదంతా అనవసరం... రేవంత్ రెడ్డి హిట్లర్ పేరు తీసారా లేదా... తీసారు... ఇంకేంటి... ఆయన హిట్లర్ పాలసీలు పాటిస్తున్నారు... హిట్లర్ లానే వ్యవహరిస్తున్నారు... ఇది ప్రజాస్వామ్య విధానానికి విరుద్ధం.. ఇదే ఇప్పుడు విపక్షాల వాదన... అయ్యా... సీఎం గారు... అసలు ఏ అంశంలో హిట్లర్ పేరు తీశారో గమనించండి... ఆయన ఉద్దేశ్యం ఏమిటో అర్థం చేసుకోండి... ఆయన వ్యాఖ్యలను పెడదారి పట్టించకండి... లేని అర్థాలు, అపోహలు ప్రజల నెత్తిన రుద్దకండీ... అంటూ తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పదే పదే వివరణలు ఇస్తూనే వున్నారు... అయినా విపక్షాలు ససేమిరా అంటున్నాయి... నాలుగు రోజుల నుంచి ఇదే టాపిక్ మీద తెలంగాణ రాజకీయం సాగుతూనే వుంది... ప్రజలకు అసలు హిట్లర్ ఎవ్వరో... ఆయన ఏం చేశారో తెలియక పోయినా ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం మొదలు పెట్టారు.

తెలంగాణలో హిట్లర్ పదం ఊత పదంగా మారిపోయింది. నేతల నోటి నుంచి మొదలు అయిన ఈ పేరు ఇప్పుడు సామాన్యులు కూడా వాడేస్తున్నారు. ఈ వివాదానికి మూలం హైడ్రా. తెలంగాణ భూబకాసురుల భరతం పట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పుడు భూకబ్జాదారుల పాలిట సింహస్వప్నం అయింది. హైదరాబాద్ లో కాస్త ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమించి క్యాష్ చేసుకునే వారి సంఖ్య లెక్కల్లో చెప్పలేం. చెరువులు, కుంటలు, పార్కులు, కొండలు, కాలువలు... ఇలా ఒకటేమిటి... ఎక్కడ స్థలం ఉంటే అక్కడ భూకబ్జాదారులు వాలి పోయారు. ఫలితంగా హైదరాబాద్ లో చినుకు పడితే ముంపు ముప్పేటదాడి చేస్తోంది. ఈ ముంపునకు అసలు కారణం గమనించిన సీఎం రేవంత్ హైడ్రా ఏర్పాటు చేశారు. దానికి విశేష అధికారాలు ఇచ్చారు. అంతే... భూబకాసురుల పై హైడ్రా ఉక్కు పాదం మోపటం మొదలు పెట్టింది. హైదరాబాద్ లో అక్రమ భూ ఆక్రమదారులను బుల్ డోజర్స్ తో తొక్కి వేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్, దాని చుట్టు పక్కన జరిగిన వేల ఎకరాల భూమిని కబ్జాల చెర నుంచి విముక్తి కలిగించింది. కాలువల ఆక్రమణల పై ప్రత్యేక దృష్టి పెట్టింది... చెరువులకు మళ్ళీ రూపు రేకలు తెచ్చింది.

పేద, మధ్య, ధనిక, ఉన్నత వర్గాల తేడా హైడ్రా చూడటం లేదన్నది ఆ సంస్థ పనితీరు చెప్పకనే చెబుతోంది. ఎంత వారైనా సరే లెక్క చేయటం లేదు. అది సర్కార్ ల్యాండ్ అని నిర్ధారణ అయితే బుల్ డోజర్ తో అక్కడ హైడ్రా ప్రవేశం చేస్తోంది. ఇదే కొందరికి నచ్చలేదు. హైడ్రా అతిగా స్పందించి వ్యవహరిస్తోందని విపక్షాలు నిప్పులు చెరుగుతున్నాయి. చూసే వారికి కూడా ఇందులో కొంచెం నిజం ఉన్నట్టు కనిపించడం సహజమే. నిజానికి హైదరాబాద్ లో చినుకులు పడి ఓ మోస్తారు వర్షాలు పడితే పరిస్థితి అత్యంత దారుణంగా మారిపోవటం చూస్తూనే వున్నాం. ప్రభుత్వ అలక్ష్యం వల్లే ఈ దుస్థితి అంటూ తిడుతూనే వున్నాం. కానీ అడ్డగోలు కట్టడాలు... కబ్జాల వల్లే ఈ దారుణమైన స్థితి వచ్చిందని మాత్రం అనుకోవటం లేదు. ఇలాంటి ఇబ్బందికి చెక్ పెట్టేందుకే హైడ్రా అంటారు పాలకులు. నిర్దాక్షిణ్యంగా



హైడ్రా అడుగులు వేయటం పెద్ద వివాదంగానే మారింది.

హైడ్రా మంచి చేస్తోందో, అతిగా వ్యవహారిస్తోందో తేల్చి చెప్పేముందు ఇప్పుడు కబ్జా బారి నుంచి బయట పడిన చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు మాత్రం తిరిగి కనిపించడం మాట వాస్తవం. దీన్ని ఎవ్వరు కాదన్న లేరు. అయితే హైడ్రా పేద, మధ్య వర్గ ప్రజల పట్ల కూడా కఠినంగా వ్యవహరించిన తీరే కొంత ఆవేదన, ఆందోళన కలిగించే అంశం. దీనిపై విపక్షాలు గట్టిగానే ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. వీటికి సమాధానంగా సీఎం రేవంత్ హైడ్రా పనితీరును హిట్లర్ తో పోల్చారు. అంతే... విపక్షాలకు ఓ పెద్ద అవకాశం చిక్కింది. రేవంత్ రెడ్డి హైడ్రాను వెనుక వేసుకొని రావటం, హిట్లర్ తో హైడ్రాను పోల్చటం పై ఒక్కసారిగా భగ్గుమంటున్నాయి. రేవంత్ హిట్లర్ సిద్దాంతాలు నమ్ముతూ అవే ఇప్పుడు పాటిస్తున్నారని ప్రతి పక్షాలు గగ్గోలు పెట్టేస్తున్నాయి. సీఎం ఉద్దేశ్యం అది కాదని పట్టిన పట్టు వదలకుండా, వెనక అడుగు వేయకుండా హిట్లర్ ఎలా విజయం సాధించారో హైడ్రా అలా దూసుకు పోతోందనే ఆయన చెప్పారని, దీన్ని వక్రీకరించి ప్రచారం చేయటం సరికాదని కాంగ్రెస్ నేతలు, మంత్రులు సుధీర్ఘ వివరణలే ఇస్తున్నారు.

హిట్లర్ పేరు ఇప్పుడు తెలంగాణలో మారు మోగుతోంది. చరిత్ర తెలియని నేటి యువత కూడా ఇప్పుడు హిట్లర్ గురించి తెలుసు కునే పనిలో పడ్డారు. కాక పోతే రాజకీయ నేతల విమర్శలు ఇప్పుడు ముదురి పోతున్నాయి. నేల విడిచి సాము పద్ధతిలో ఏ రాజకీయ పార్టీ నేత ఎందుకు ఎవరిని ఏ పాయింట్ మీద విమర్శలు చేస్తున్నాడో అర్థం కానీ పరిస్థితి వచ్చి పడింది. రాష్ట్రంలో ఇంక ఏ సమస్య లేనట్టు ఇప్పుడు హిట్లర్ రాజకీయాలు తెలంగాణలో పెరిగి పోవటం ప్రజలకు చిరాకు తెప్పిస్తోంది. హైడ్రా ఇప్పుడు మీడియాలో ఓ పెద్ద ప్లేస్ ఆక్రమించింది. హైదరాబాద్, దాని చుట్టు పక్కన ప్రాంతాల్లో దురాక్రమణలను మాత్రమే కూల్చి, ప్రభుత్వ స్థలాలు పరిరక్షణకు ఏర్పాటు అయిన హైడ్రా ఇలా రాజకీయ ప్రకంపనలకు కేంద్ర బిందువు అవుతుందని ఎవ్వరు ఊహించి వుండరు. ఇక హిట్లర్ పేరు కూడా ఒక్కసారిగా అందరి నోట మాట అవుతుందని కూడా అనుకోని వుండరు. మొత్తానికి ఇప్పుడు తెలంగాణలో హిట్లర్ హీట్ లో రాజకీయాలు రంజుగానే సాగి పోతున్నాయి. అవకాశం వస్తే దేన్నీ రాజకీయ పార్టీలు వదులుకోవు అనే నిజం మరోసారి రుజువు అయింది.



జీ. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్టు

# ప్రేమలో పడ్డ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- **డేటింగ్ ప్రపంచంలో సరికొత్త శకం.**
- **మనుషుల మనోభావాలకు సాంకేతికత అద్దం పడుతున్న వైనం.**

**హైదరాబాద్, మహా :** ఆధునిక యుగంలో ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలు పూర్తిగా డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుంటున్నాయి. ఒకప్పుడు రెండు మనసుల మధ్య సహజంగా పుట్టే ప్రేమ, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) అనే మూడో వ్యక్తి చేతుల్లోకి మారుతోంది. ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లలో మీరు చదివే అద్భుతమైన సందేశాలు, మనసును కదిలించే కవిత్వాలు, చమత్కారమైన సంభాషణలు నిజంగా మీ సంభావ్య భాగస్వామి మనసులో నుంచి వచ్చినవి కాకపోవచ్చు. అవి చాట్‌జీపీటీ, జెమిని లేదా ఇతర ఏఐ టూల్స్ సృష్టించిన అక్షరాల గారడీ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. భారతదేశంలో డేటింగ్ సంస్కృతి ఎంతలా మారిపోయిందంటే, తమ భాగస్వాములను ఆకట్టుకునేందుకు యువత విపరీతంగా ఏఐ సాంకేతికతపై ఆధారపడుతున్నారు. దీనిపై ఇటీవల వెలువడిన ఒక భారీ సర్వే ఫలితాలు తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.



**# ఏఐ లవ్ గురు.. డేటింగ్ యాప్‌లలో టెక్నాలజీ వింగ్‌మ్యాన్**

ప్రముఖ డేటింగ్ యాప్ గ్లీడెన్, అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇప్సోస్ సంయుక్తంగా దేశవ్యాప్తంగా 1,500 మంది భారతీయులపై ఒక సమగ్రమైన సర్వేను నిర్వహించాయి. ప్రధానంగా మెట్రో నగరాలైన బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఇంటర్నెట్ వినియోగం ఎక్కువగా ఉన్న యువత, ఉద్యోగుల అభిప్రాయాలను ఈ సర్వే పరిగణనలోకి తీసుకుంది. ఈ సర్వేలో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. దాదాపు 63 శాతం మంది భారతీయులు తమ ప్రేమ వ్యవహారాల్లో, డేటింగ్ విషయాల్లో ఏఐ టూల్స్‌ను ఒక నమ్మకమైన లవ్ గురుగా ఆశ్రయిస్తున్నారు. ఎవరితోనైనా సంభాషణ ప్రారంభించాలన్నా, ఇబ్బందికర పరిస్థితుల నుంచి సున్నితంగా బయటపడాలన్నా రోబోల సలహాలు తీసుకుంటున్నారు.

గతంలో డేటింగ్ ప్రొఫైల్స్ కోసం నిపుణులైన ఫొటోగ్రాఫర్లను, రచయితలను లేదా తమ స్నేహితులను సలహాలు అడిగేవారు. ఇప్పుడు ఏఐ టూల్స్ 24 గంటలూ అందుబాటులో ఉండటం, ఎలాంటి అమాయకపు ప్రశ్న అడిగినా ఎగతాళి చేయకుండా క్షణాల్లో ఓపికగా సమాధానాలు ఇస్తుండటంతో యువత అటువైపే మొగ్గుచూపుతున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 66 శాతం మంది తమ డేటింగ్ ప్రొఫైల్స్, సోషల్ మీడియా బయోలను మరింత ఆకర్షణీయంగా మార్చుకోవడానికి ఏఐ అల్గారిథమ్స్ సహాయం తీసుకున్నారు. అలాగే 61 శాతం మంది తమ భాగస్వామితో రియల్ టైమ్‌లో చాట్ చేస్తున్నప్పుడు కూడా, ఏఐ సూచించిన సమాధానాలనే కాపీ చేసి పంపుతున్నారు. రిజ్ (Rizz) వంటి అత్యాధునిక డేటింగ్ ఏఐ యాప్‌లు ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులోకి రావడం, చాట్ స్క్రీన్ షాట్లను విశ్లేషించి మరీ ఎదుటివారి మూడ్ కు తగ్గట్టు ఎలాంటి రిప్లై ఇవ్వాలో ఏఐ సూచిస్తుండటంతో ఈ ట్రెండ్ మరింత వేగంగా విస్తరిస్తోంది.

**# పెరుగుతున్న సాంకేతికత.. తీరని ఒంటరితనం**

ఏఐ సాంకేతికత మనుషుల ప్రొఫైళ్లను, సంభాషణలను అత్యంత ఆకర్షణీయంగా, లోపం లేకుండా తీర్చిదిద్దుతున్నప్పటికీ.. అది వారి నిజ జీవితంలో ఆనందాన్ని నింపలేకపోతోందని మానసిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన మరో విచిత్రమైన, బాధాకరమైన వాస్తవం ఏమిటంటే.. సర్వేలో పాల్గొన్న వారిలో 92 శాతం మంది తమ రొమాంటిక్ జీవితం పట్ల సంతృప్తిగా ఉన్నామని పైకి చెబుతున్నప్పటికీ, వారిలో 57 శాతం మంది ఇంకా లోతైన ఒంటరితనంతోనే కుమిలిపోతున్నారు. దీనిని సైకాలజిస్టులు డిజిటల్ ఇల్యూజన్ ఆఫ్ కనెక్షన్ (కృత్రిమ అనుబంధాల భ్రమ) అని పిలుస్తున్నారు. ఒక కంప్యూటర్ ప్రోగ్రామ్ అద్భుతమైన పదాలను పేర్చగలదు, కానీ ఇద్దరు మనుషుల మధ్య ఉండాల్సిన సహజమైన కెమిస్ట్రీని, కంటి చూపుతో పంచుకునే భావోద్వేగాలను, స్పర్శను ఏఐ సృష్టించలేదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతా పర్ఫెక్ట్ గా ఉన్నా సరే, ఆ బంధంలో జీవం లోపించిందనే వెలితి వారిని వెంటాడుతోంది.

**# నిజాయతీకి పెరుగుతున్న డిమాండ్.. పట్టుబడితే పరువుపోతుందనే భయం**

ప్రేమ వ్యవహారాల్లోకి ఏఐ ప్రమేయం ఎంతలా చొచ్చుకువస్తుందో, మరోవైపు సహజత్వానికి, నిజాయతీకి అంతే స్థాయిలో అరుదైన విలువ ఏర్పడుతోంది. తమ ఏఐ సంభాషణల హిస్టరీని ఎవరైనా చూస్తే లేదా తమ అసలు బండారం బయటపడితే తీవ్ర అవమానంగా భావిస్తామని 69 శాతం మంది అంగీకరించడం ఈ ఆధునిక డేటింగ్ సంస్కృతిలోని డొల్లతనాన్ని బయటపెడుతోంది. దీనినే ఏఐ క్యాట్ ఫిషింగ్ లేదా ఇంపోస్టర్ సిండ్రోమ్ అని కూడా అంటారు. ఆన్‌లైన్‌లో ఏఐ సాయంతో అద్భుతమైన, చమత్కారమైన వ్యక్తిగా కనిపించిన వారు, తీరా నేరుగా కలుసుకున్నప్పుడు ఆ స్థాయిలో మాట్లాడలేక, ఆకర్షించలేక తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. అనిశ్చితి, సందేహాలు ఉన్నప్పుడు చాట్‌బాట్‌ల వద్ద తమ మనసులోని భయాలను దాచుకోకుండా బయటపెడుతున్న వీరు, పబ్లిక్ డేటింగ్ ప్రొఫైల్‌లో మాత్రం అద్భుతమైన వ్యక్తిత్వం ఉన్నట్లుగా ఏఐ సృష్టించిన ముసుగును ధరిస్తున్నారు. సంభాషణల్లోని తప్పులు, సహజంగా వచ్చే ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ముసుగులు లేని నిజాయతీతో కూడిన బంధాలే నేటి కాలంలో అత్యంత విలువైనవని, కృత్రిమ మేధ కేవలం పదాలను మాత్రమే ఇవ్వగలదని, పరిపూర్ణమైన ప్రేమను కాదని ఈ అధ్యయనం తేటతెల్లం చేస్తోంది.

# మారుతున్న పార్లమెంట్ రాజకీయ ముఖచిత్రం



భారత పార్లమెంటరీ చరిత్రలోనే అత్యంత ఆసక్తికరమైన రాజకీయ సమీకరణాలకు ఢిల్లీ వేదికవుతోంది. మొన్నటివరకు విపక్షాల ఐక్యతతో ఊపుమీద కనిపించిన 'ఇండియా' కూటమిలో ఊహించని కుదుపులు, ప్రాంతీయ పార్టీలలో తిరుగుబాట్లు.. కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి కొత్త ఊపిరి పోస్తున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన , 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' (వన్ నేషన్, వన్ ఎలక్షన్) వంటి ప్రతిష్టాత్మక బిల్లులను ఎలాగైనా చట్టసభల్లో ఆమోదింపజేసుకోవాలని భావిస్తున్న అధికార కూటమికి, మారుతున్న రాజకీయ ముఖచిత్రం భారీ ఊరటనిస్తోంది. గత ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ సమావేశాలు కేంద్ర ప్రభుత్వానికి పెద్ద షాక్ ఇచ్చాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. రాజ్యాంగ సవరణకు అవసరమైన 'ప్రత్యేక మెజారిటీ' అంటే.. సభకు హాజరై ఓటు వేసిన వారిలో మూడింట రెండు వంతుల (2/3) మద్దతు ఎన్డీఏకు లేకపోవడమే దీనికి కారణం. ఆ రోజు సభకు హాజరైన 528 మంది ఎంపీలలో, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. మ్యాజిక్ ఫిగర్ అయిన 352 మార్కును అందుకోవడానికి కేవలం 54 ఓట్ల దూరంలో బిల్లు నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వం డిలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను తాత్కాలికంగా వెనక్కి తీసుకోక తప్పలేదు. అయితే ఈ పరాజయం తాత్కాలికమేనని నిరూపిస్తూ ఇప్పుడు ఢిల్లీ రాజకీయాల్లో సీన్ రివర్స్ అయింది.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తదనంతర పరిణామాలు తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర సంక్షోభాన్ని సృష్టించాయి. లోక్‌సభలో మొత్తం 29 మంది ఎంపీలు ఉన్న టీఎంసీలో ఏకంగా 20 మంది ఎంపీలు మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు జెండా ఎగరేశారు. పార్టీ చీఫ్ విప్ కాకోలి ఘోష్ దస్తీదార్ నేతృత్వంలోని ఈ రెబెల్ ఎంపీల బృందం కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ నివాసంలో సమావేశమై, ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. ఒక పార్టీ పార్లమెంటరీ విభాగాన్ని చీల్చాలంటే కనీసం మూడింట రెండు వంతుల ఎంపీల మద్దతు అవసరం. టీఎంసీకున్న 29 మందిలో ఈ సంఖ్య 19 అవుతుంది. కానీ, రెబెల్స్ వద్ద 20 మంది ఎంపీల బలం ఉండటంతో, చట్టపరమైన ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కూటమిగా ఏర్పడి ఎన్డీఏకు మద్దతు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. ఒకవేళ వీరంతా ప్రత్యేక కూటమిగా ఏర్పడి మద్దతిస్తే లోక్‌సభలో ఎన్డీఏ బలం ఒక్కసారిగా 300 మార్కును దాటనుంది. మరోవైపు, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే (DMK), ఇండీ కూటమి నుంచి అధికారికంగా వైదొలిగింది. కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకున్న డీఎంకే ఎంపీలు, పార్లమెంట్‌లో తమకు విడిగా సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు లేఖ కూడా రాశారు. ఈ పరిణామాన్ని క్యాష్ చేసుకునేందుకు బీజేపీ రంగంలోకి దిగింది. డీఎంకే నుంచి షరతులతో కూడిన మద్దతు పొందేందుకు ముమ్మర చర్చలు జరుపుతోంది. కాంగ్రెస్ తీరుతో విసిగిపోయిన డీఎంకేకు చెందిన 22 మంది లోక్‌సభ ఎంపీలు ఎన్డీఏకు మద్దతు ఇచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ ఈ చర్చలు సఫలమైతే ఎన్డీఏకు మూడింట రెండు వంతుల మెజార్టీ మరింత సులువవుతుంది.

ప్రస్తుతం లోక్‌సభలో ముగ్గురు ఎంపీల మరణంతో మొత్తం స్థానాల సంఖ్య 540గా ఉంది. రాజ్యాంగ సవరణకు అవసరమైన 2/3 వంతు మెజారిటీ సాధించాలంటే 360 మంది ఎంపీల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ సొంత బలం 293 కాగా, కొత్త సమీకరణాలతో ఆ సంఖ్య వేగంగా మారుతోంది. మొదటగా 20 మంది టీఎంసీ రెబెల్ ఎంపీల మద్దతుతో ఎన్డీఏ బలం 313కు చేరుతుంది. వీరికి తోడుగా 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకే కూడా చేతులు కలిపితే ఆ సంఖ్య 335కు పెరుగుతుంది. ఇక్కడితోనే ఆగకుండా, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన కు చెందిన తొమ్మిది మంది ఎంపీలపై కూడా ఎన్డీఏ కన్నేసింది. వారిలో కూడా చీలిక తెచ్చి కనీసం ఆరుగురు ఎంపీలను తమవైపు తిప్పుకుంటే మొత్తం బలం 341 అవుతుంది. ఇటీవల కొన్ని కీలక బిల్లుల సమయంలో జరిగిన క్రాస్ ఓటింగ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే, ఎన్డీఏకు దాదాపు 348 మంది ఎంపీల మద్దతు లభించే అవకాశం ఉందని అంచనా. అంటే రాజ్యాంగ సవరణకు అవసరమైన 360 మార్కుకు ఎన్డీఏ కేవలం 12 ఓట్ల దూరంలో మాత్రమే నిలుస్తుంది. ఈ స్వల్ప వ్యత్యాసాన్ని ఇతర చిన్న పార్టీలు, స్వతంత్ర ఎంపీల ద్వారా సులభంగా అధిగమించవచ్చని బీజేపీ నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. లోక్‌సభలోనే కాకుండా ఎగువసభ అయిన రాజ్యసభలోనూ ఎన్డీఏ బలం పుంజుకుంటోంది. ఇప్పటికే రాజ్యసభలో ఎన్డీఏ బలం 150 దాటింది. ఇక్కడ 2/3 వంతు మెజారిటీ...



# ఖమ్మంలో దారుణం

- 12 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్యాయత్నం
- విషమంగా చిన్నారి పరిస్థితి.

**ఖమ్మం, మహా :** ఖమ్మం జిల్లాలో అత్యంత దారుణమైన, అమానవీయ ఘటన చోటుచేసుకుంది. వేసవి సెలవుల కోసం తాత, అమ్మమ్మల వద్దకు వచ్చిన 12 ఏళ్ల చిన్నారిపై ఒక కీచకుడు అత్యాచారానికి పాల్పడి, ఆపై భవనం పైనుంచి కిందకు తోసేసిన హృదయ విదారక ఘటన ఖమ్మం రాపర్తి నగర్‌లోని జీ ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. ఈ క్రూరమైన దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉంది.వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన 12 ఏళ్ల కుమార్తె, ఖమ్మం రాపర్తి నగర్‌లోని జీ ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో పని చేసుకుంటున్న తన తాత, అమ్మమ్మల వద్దకు వేసవి సెలవులకు వచ్చింది. అదే అపార్ట్‌మెంట్‌లో రెండో అంతస్తులో నివాసం ఉంటున్న 42 ఏళ్ల గౌస్ పాషా అనే వ్యక్తి కన్ను ఆ చిన్నారిపై పడింది. పథకం ప్రకారం ఆ బాలికను అపార్ట్‌మెంట్ పైభాగంలోకి తీసుకువెళ్లిన నిందితుడు, ఆమె రెండు చేతులు కట్టేసి అత్యంత హేయంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఈ దారుణం బయట పడుతుందన్న భయంతో, తన తప్పును కప్పిపుచ్చుకునే నెపంతో ఆ చిన్నారిని అపార్ట్‌మెంట్ పైనుంచి కిందకు తోసేశాడు. పైనుంచి పడిపోవడం వల్ల బాలిక రెండు చేతులు, వెన్నెముక విరిగిపోవడంతో పాటు లోపలి అవయవాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఆ చిన్నారి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

ఈ అమానుష ఘటన గురించి తెలుసుకున్న బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మంగళవారం నాడు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, చికిత్స పొందుతున్న బాలికను, ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితుడు గౌస్ పాషాపై ఖమ్మం టూ టౌన్ పోలీసులు కేవలం పోక్సో కేసు మాత్రమే నమోదు చేశారని, పోలీసులే నిందితుడికి రక్షణ కల్పిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. మానవత్వం మరచి మృగంలా ప్రవర్తించిన నిందితుడిని బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఖమ్మం జిల్లాలో మైనర్ హిందూ బాలికలకు రక్షణ లేకుండా పోతోందని, పక్కా ప్రణాళికతో లవ్ జిహాద్ పేరుతో కొందరు ట్రాప్ చేసి దాడులకు పాల్పడుతున్నారని కోటేశ్వరరావు మండిపడ్డారు. గతంలో ఖమ్మం, కొణిజర్ల, బోనకల్లు ప్రాంతాల్లో జరిగిన ఇలాంటి ఘటనలను ఆయన గుర్తుచేశారు. దోషులకు సరైన శిక్షలు పడకపోవడం వల్లే ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని అన్నారు. తక్షణమే ఆ చిన్నారిని మెరుగైన అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా మంత్రులకు విజ్ఞప్తి చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ బాలికలపై దాడులు పునరావృతమైతే సహించేది లేదని, నిందితులను నడిరోడ్డుపై ఉరికిస్తామని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అలాగే, నగరంలో పెరుగుతున్న గంజాయి, మత్తు పదార్థాల వాడకంపై కూడా పోలీసులు తక్షణమే ఉక్కుపాదం మోపాలని ఆయన కోరారు.

# ముగ్గురిని కాపాడి అమరుడైన అనురూప్...

- ఆయన కుటుంబానికి అండగా ఉంటాం....
- భువనగిరి ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్ రెడ్డి...
- అమెరికా నుంచి స్వగ్రామానికి మృతదేహం...
- ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి, సామెల్ నివాళి...
- గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అమెరికాలోని సెబాన్ నదిలో ముగ్గురిని కాపాడి, ప్రాణాలు కోల్పోయిన అనురూప్ రెడ్డి మృతదేహానికి భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ నివాళి అర్పించారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన, కోదూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి, రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి.... వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా... గత నెల 30న స్నేహితులతో కలిసి లూసియానాలోని టోరోడో పార్కు వద్ద సెబాన్ నది వద్దకు వెళ్లారు. ముగ్గురు స్నేహితులు లోతులోకి వెళ్లి నీట మునగగా... అనురూప్ వారిని ఒడ్డుకు లాగి, తాను వస్తుండగా నదిలో వేసిన ఓ వల అతడి కాళ్లకు చుట్టుకుంది. ఈ క్రమంలోనే నీటమునిగి అనురూప్ ప్రాణాలు కోల్పోయారు. 10 రోజుల తర్వాత యువకుడి మృతదేహం కవాడిపల్లికి చేరుకోగా... గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**అనురూప్ పార్థివ దేహానికి నివాళులు....**

అనురూప్ మృతదేహం పై పుష్పగుచ్ఛం ఉంచి, నివాళి అర్పించిన ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామెల్..... శోకసంద్రంలో ఉన్న కుటుంబసభ్యులను ఓదార్చారు. యువకుడి త్యాగానికి గుర్తుకు సీఎం రేవంత్ రెడ్డి పంపిన కమెండేషన్ లెటర్ ను వారు కుటుంబసభ్యులకు అందజేశారు. అనురూప్ సమయస్ఫూర్తితో ముగ్గురిని కాపాడినా.... తాను ప్రాణాలు కోల్పోవటం దురదృష్టకరమన్నారు. అనురూప్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



## నూతన తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు

**కుషాయిగూడ, మహా :** కాప్రా మండల నూతన తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ఏ. మతీన్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాషవోని కొండల్ ముదిరాజ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేసేలా విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శోభా రెడ్డి, పల్లపు రవి, సిద్ధులు తదితరులు పాల్గొని నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# వైభవంగా ముగిసిన శ్రీ సుదర్శన మహా మంత్ర హోమం....

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామనగర్ లోని సమతామూర్తి కేంద్రంలో గత 11 రోజులుగా అత్యంత వైభవంగా లోకక్షేమం, విశ్వశాంతిని కాంక్షిస్తూ ముచ్చింతల్‌లో నిర్వహించిన శ్రీ సుదర్శన మహా మంత్ర హోమం మంగళవారం ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా భక్తుల నుంచి ఈ హోమానికి విశేష ఆదరణ లభించింది.మంగళవారం చివరి రోజు కావడంతో సమతామూర్తి ప్రాంగణంలో భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ మహోన్నత క్రతువులో శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామీజీ, శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామీజీ, శ్రీ రంగరామానుజాచార్య స్వామీజీ ల పర్యవేక్షణలో, వారి దివ్య మంగళాశాసనాలతో శాస్త్రోక్తంగా శ్రీ సుదర్శన మహా మంత్ర హోమం సాగింది. స్వామీజీలు హోమ విశిష్టతను భక్తులకు వివరిస్తూ, లోక కల్యాణం కోసం సుదర్శన మహామంత్ర జపం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. అందరం భక్తులకి పూర్ణ కుంభ ప్రోక్షణ చేశారు. ఈ ముగింపు వేడుకల్లో మైహోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ గుండంలో పూర్ణాహుతి సమర్పించి, స్వామీజీల ఆశీర్వాదం తీర్థప్రసాదాలను అందుకున్నారు.





# పట్టాలు, ఇంటి నంబర్లు ఉన్నా

- చీకటిలోనే చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు
- చీకటిని పారదోలి వెలుగులు నింపండి మహా ప్రభు

**కుషాయిగూడ, మహా :** ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చింది. పట్టాలు, ఇంటి నంబర్లు కూడా ఇచ్చింది. కానీ కనీస సౌకర్యం కరెంట్ మాత్రం ఇవ్వలేదు. మేడ్చల్ జిల్లా కీసర మండలం చీర్యాల గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో లబ్ధిదారుల పరిస్థితి ఇది. సుమారు ఏడాది క్రితం లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి పట్టా పత్రాలు, ఇంటి నంబర్ల ప్లేట్లు అధికారులు అందజేశారు. కానీ విద్యుత్ కనెక్షన్ కోసం స్థానిక ఏఈ మురళి ఆఫీస్ చుట్టూ తిరిగినా ఫలితం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

**చీకట్లోనే జీవనం**

ఇళ్లకు మీటర్లు లేకపోవడంతో రాత్రిపూట లాంతర్లు, కొవ్వొత్తుల వెలుతురులోనే జీవనం సాగిస్తున్నారు. పిల్లల చదువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. వంట, ఇతర గృహ అవసరాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "ఇల్లు ఇచ్చారు, పట్టా ఇచ్చారు, నంబర్ ఇచ్చారు... కానీ కరెంట్ మీటర్ మాత్రం ఇవ్వడం లేదు. ఏఈ మురళిని ఎన్నిసార్లు అడిగినా 'ఫైలు పెండింగ్‌లో ఉంది' అని చెప్పి పంపిస్తున్నారు" అని లబ్ధిదారురాలు దేవిక ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యం**

ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించింది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులు మాత్రం సౌకర్యాలు లేకుండా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. వెంటనే స్పందించి చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని అన్ని ఇళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కలెక్టర్, విద్యుత్ ఉన్నతాధికారులను కోరుతున్నారు.





# నవ లిమిటెడ్ కు సిఎస్ఆర్ అవార్డు

- మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందుకున్న నవ ప్రతినిధులు
- అవార్డు రాకతో సంతోషం వ్యక్తం చేసిన సిబ్బంది

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ జే ఆర్ సి కన్వెన్షన్ సెంటర్లో నవ లిమిటెడ్ యాజమాన్యం ప్రతినిధులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఎక్స్ లెన్స్ ఇన్ సిఎస్ఆర్ 2026 అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ యూనిట్ హెడ్ తెలంగాణ ఆపరేషన్ రేర్ అడ్మిరల్ ఎల్ వి శరత్ బాబు (వి) మాట్లాడుతూ నవ లిమిటెడ్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలతో పాటుగా ప్రధానంగా ఆరోగ్యం విద్య జీవనోపాధి ఇతర రంగాల్లో అందిస్తున్న సేవలకు కృషిని గుర్తించిన నేపథ్యంలో ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అవార్డును నవ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బత్తుల శ్రీనివాసరావు, కంపెనీ సెక్రటరీ వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్. ఎన్.రాజు, డిజిఎం రామెటీరియల్స్ కే.శ్రీహరి రెడ్డి, మేనేజర్ సిఎస్ఆర్ సిహెచ్ శ్రీనివాసరావు, సోషల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, ఎఫ్ టి సి సి ఐ ప్రతినిధులు ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, జూనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.కె.మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్, కె.భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఎనుమాముల మార్కెట్ యార్డును సందర్శించిన కలెక్టర్**



**మహా వరంగల్;** త్రైమాసిక తనిఖీ షెడ్యూల్ లో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను పరిశీలించారు. గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎనుమాముల మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక జిల్లా కలెక్టర్‌కు పూల బొకే తో స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డులోని పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారుల తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ జనార్ధన్, మార్క్‌ఫెడ్ జిల్లాతో పాటు ఎన్నికల విభాగ డిటి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 20న, 2వ జాతీయ లోక్ అదాలత్

**మహా వరంగల్ బ్యూరో;** తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో, హైకోర్టుతో సహా 2026 జూన్ 20న 2వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, రాజీకి అనువైన క్రిమినల్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు.సంబంధిత శాఖలు, అధికారులు, న్యాయ సేవా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గరిష్ట సంఖ్యలో ప్రజలు పాల్గొని లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# జూన్ 30 వరకు ఐటీఐ ప్రవేశాల గడువు పొడిగింపు...

- కృష్ణసాగర్, మణుగూరు ఐటీఐలు, ఏటీసీల్లో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం..
- వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు..



మణుగూరు, మహా : ప్రభుత్వ ఐటీఐలు, ఏటీసీలలో మొదటి విడత ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కృష్ణసాగర్-మణుగూరు ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లో ప్రవేశాల కోసం తొలుత ఈ నెల 8 వరకు గడువు నిర్ణయించగా, ప్రభుత్వం తాజాగా జూన్ 30 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పినపాక నియోజకవర్గ పరిధిలోని కృష్ణసాగర్, మణుగూరు ప్రభుత్వ ఐటీఐలు, ఏటీసీలలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సులకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కృష్ణసాగర్, మణుగూరు ఏటీసీలలో సీఎన్‌సీ, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, వర్చువల్ అనాలసిస్ డిజైనర్ అండ్ ఫైనైట్ ఎలిమెంట్ మెథడ్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐలో 6305949086, 9866463716 నంబర్లను, మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో 9848853255, 9492959511 నంబర్లను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

# మణుగూరు కార్మికోద్యమానికి తీరని లోటు..

- మిడిదొడ్ల నాగేశ్వరరావుకు ఘన నివాళులు
- వివిధ కార్మిక, ప్రజా, రాజకీయ సంఘాల నేతల సంతాపం..



**మణుగూరు, మహా :** మణుగూరు కార్మికోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఐఎఫ్‌టియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ మిడిదొడ్ల నాగేశ్వరరావు మృతితో కార్మిక లోకం గొప్ప నాయకుడిని కోల్పోయిందని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి అనురాధ అన్నారు. నాగేశ్వరరావు (57) అనారోగ్యంతో ఈ నెల 8న మృతి చెందిన నేపథ్యంలో మంగళవారం మణుగూరులో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎస్.డి. నాసర్ పాషా అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. గత 28 సంవత్సరాలుగా కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి నాగేశ్వరరావు అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. మోటార్ కార్మికులు, సింగరేణి కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. భూ నిర్వాసితులు, ఆదివాసీల సమస్యల పరిష్కారంలోనూ ఆయన ముందుండి పోరాడారన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు అందించడంతో పాటు మణుగూరు కేంద్రంగా జరిగిన పలు ఐక్య ఉద్యమాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు. కార్మిక ఉద్యమంలో గుర్తింపు పొందిన నాయకుడిగా ఎదిగిన నాగేశ్వరరావు మరణం మణుగూరు ప్రాంతానికి తీరని లోటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంస్మరణ సభలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. సీతారామయ్య, పీఓడబ్ల్యూతో జిల్లా అధ్యక్షురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, టీయూసీఐ జిల్లా నాయకులు ఆర్ మధుసూదన్ రెడ్డి, టీడీపీ జిల్లా నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కె రమణయ్య, సీఐటీయూ నాయకుడు మచ్చా నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు ఎండి ఖాసిం, ఐఎన్‌టీయూసీ నాయకుడు జి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు నవీన్, పట్టణ అధ్యక్షుడు జి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకుడు పి శ్రీనివాస్, ఆర్టీసీ జేఏసీ నాయకుడు ఎ కృష్ణ, వ్యాపార సంఘం నాయకుడు నూకల రాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎస్.కె పాషా, నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె సాంబయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కె సారంగపాణి, సీనియర్ నాయకులు తోడేటి నాగేశ్వరరావు, డి ప్రసాద్, ఆంగోత్ మంగీలాల్, పీవైఎల్ జిల్లా నాయకుడు ముసలి సతీష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రణయ్ కుమార్, సాధన పల్లి రవి, పట్టణ ప్రముఖులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కామ్రేడ్ నాగేశ్వరరావుకు ఘనంగా నివాళులర్పించి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## ఈనెల 20 జాతీయ లోక్ అదాలత్

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మితో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రాజీమార్గం ద్వారా కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందుకు లోక్ అదాలత్ మంచి వేదికన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## ఉపాధి హామీ పనులు కార్మికులకు అందని ద్రాక్షగా మారుతున్నాయి

**మొరంపల్లి బంజారాలో ఉపాధి కార్మికుల సమస్యలపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళన**

**బూర్గంపహాడ్, మహా :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద కార్మికులకు కల్పించాల్సిన ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గిపోతుండటంతో ఉపాధి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం బూర్గంపహాడ్ మండలంలోని మొరంపల్లి బంజారా గ్రామపంచాయతీ పరిధిలోని ఊరచెరువు వద్ద కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం ప్రకారం సంవత్సరానికి 125 రోజుల పని కల్పించాల్సి ఉన్నప్పటికీ, మండలంలోని అనేక గ్రామాల్లో కార్మికులకు తగినంత పని చూపించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా పనులు నిలిపివేస్తూ "ఇప్పటి నుంచి పని లేదు" అని అధికారులు చెబుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కార్మికులకు రోజుకు కనీసం రూ.600 వేతనం చెల్లించాలని, పనిస్థలాల్లో తాగునీటి సౌకర్యం, టెంట్లు, మెడికల్ కిట్, గడ్డపారలు, పారలు, తట్టలు వంటి అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఫోటో ధృవీకరణ విధానంపై కార్మికుల ఆవేదనప్రస్తుతం అమల్లో ఉన్న రెండు ఫోటోలు తీసే విధానం కార్మికులకు ఇబ్బందికరంగా మారిందని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కళ్లు, ముఖం స్పష్టంగా కనిపించే విధంగా తీసే ఫోటో ధృవీకరణ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఉపాధి కార్మికుడు వెంకటరామిరెడ్డి ఎదుర్కొన్న సమస్యను ఉదాహరణగా వివరించారు. దేవుడికి చేసిన మొక్కు తీర్చుకునేందుకు తల నీలాలు సమర్పించి తిరిగి పనికి వచ్చిన ఆయన ఫోటోను మొబైల్ యాప్ గుర్తించకపోవడంతో హాజరు నమోదు కాలేదని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా, తలపై వెంట్రుకలు లేకపోవడం, మీసాలు లేకపోవడం వల్ల యాప్ ఫోటోను స్వీకరించడం లేదని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోర్స్ తిరుపతయ్య, పాయం సాయి, రామకృష్ణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సక్సెస్ చేయాలి

- ఓటర్ మ్యాపింగ్ లో అందరూ భాగస్వాములవ్వాలి
- గడువు లోగా పూర్తి చేసుకోవాలన్న కలెక్టర్



**ఆదిలాబాద్ మహా:** ఓటర్ల మ్యాపింగ్‌లో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తన ఓటును ఎస్.ఐ.ఆర్ 2002 ఎలక్టోరల్ రోల్‌కు బీఎల్ఓ, ఎంఆర్ఓల సమక్షంలో ఆయన విజయవంతంగా మ్యాపింగ్ చేసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత 2002 నాటి ఎస్.ఐ.ఆర్ సమయానికి తనకు ఓటు లేనందున, అప్పట్లో బీహార్‌లో ఉన్న తన తండ్రి గారి ఓటు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లో 'సెర్చ్ బై కలెక్టర్ నేమ్' ద్వారా కేవలం ఐదు ప్రాథమిక వివరాలు నమోదు చేసి సులభంగా సేకరించానని, అనంతరం బీఎల్ఓ యాప్‌లో మ్యాపింగ్ పూర్తి చేశానని వివరించారు. ఇది అత్యంత సరళమైన ప్రక్రియ అని, ఒకవేళ తెలంగాణ పరిధిలోనే పాత ఓటు ఉండి ఉంటే తెలంగాణ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా పాత ఎస్.ఐ.ఆర్ 2002 వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ టౌన్, మావల ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియకు జూన్ 24 వరకు గడువు ఉందని, ఆ తర్వాత జూన్ 25 నుండి బీఎల్ఓలు ఇంటింటికీ వచ్చి ఎన్యుమరేషన్ ఫారమ్స్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభిస్తారని తెలిపారు. కాబట్టి, కాలపరిమితి గల ఈ ముఖ్యమైన ఓటర్ల మ్యాపింగ్‌లో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ యజ్వేందర్, బిఎల్ఓ నివేదిత తదితరులు పాల్గొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువులు విత్తనాల స్టాక్, క్రయ విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్ లలోని వివరాలను ఆన్లైన్ వివరాలతో సరిపోల్చారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులన్నీ పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో తేడాలు ఉండరాదన్నారు. పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను అమ్మరాదని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని అన్నారు. రైతుల నుంచి విత్తనాలు, ఎరువులకు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదని చెప్పారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీవి అమ్మినా, అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## డంపింగ్ యార్డును ఎత్తేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- కాలుష్య కొరల్లోకి గండిపేట చెరువు చేరే అవకాశం
- హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి



**మొయినాబాద్ మహా:** జంట నగరాలకు తాగునీరు అందించే జంట జలాశయాల్లో ఒకటైన గండిపేట చెరువు కాలుష్యానికి కారణమయ్యే ఈ డంపింగ్ యార్డును తొలగించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ సర్వేనెంబర్ 151 ప్రభుత్వ భూమిలో ఉన్న డంపింగ్ యార్డ్ ను ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడారు. విలేకరులతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా అప్పట్లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తుచేశారు. అయితే తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని తొలగించి చెత్తచెదారాలతో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి ఇక్కడి ప్రాంతాలను కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. ఒక వైపు మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇళ్లు కుల్చుతున్న రేవంత్ రెడ్డి బంగారం లాంటి ప్రాంతాన్ని మురికి కంపగా మారుస్తున్నాడని ఆరోపించారు. హైదరాబాద్ నగరానికి త్రాగు నీరు అందించే జంటజలాశయల్లో ఒకటైన గండిపేట చెరువు ఈ డంపింగ్ యార్డు కు అతి సమీపంలో ఉందని వర్షం కురిస్తే కలుషితమవుతుందని ఆరోపించారు. వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ ముదిగొండ మంజుల రవి యాదవ్, నాయకులు అనంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీహరి యాదవ్, కొత్త నరసింహారెడ్డి, మోర శ్రీనివాస్, మోహన్ రెడ్డి, రవుఫ్, కౌన్సిలర్ శ్రీధర్, షాబాద్ మధు, మాల స్వామి, పరమేష్, కాళిదాస్ చారి, దర్గుపల్లి రాజేందర్, మోత్కుపల్లి సునీల్, కిరణ్ ఉన్నారు.

## నూతన పాఠ్యాంశాల పై పట్టు సాధించాలి

**డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్**

మూడు రోజుల ఆన్ లైన్ శిక్షణ ప్రారంభం

మహా వరంగల్ బ్యూరో;ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం లో ఈ విద్యా సంవత్సరం నుండి మారిన పాఠ్యాంశాల పై వరంగల్ జిల్లా అధ్యాపకులకు మూడు రోజుల పాటు ఆన్ లైన్ శిక్షణ ను ప్రారంభించినట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న తెలుగు, హిందీ 10న సివిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ, కామర్స్ , 11న సైన్స్ మరియు గణితం అంశాల పై సంబంధిత విషయ నిపుణులతో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠ్యాంశాల్లో, ప్రశ్నాపత్రాలు, ప్రాక్టికల్స్ మార్కుల విభజన తదితర అన్ని అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ విద్యా సం.లో అంతర్గత మూల్యాంకనం ద్వారా 20 మార్కులు కేటాయిస్తున్నారని, ఎప్పటికప్పుడు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని , అన్ని కళాశాలల అధ్యాపకులు ఈ అంశాలపై అవగాహన పెంచుకోవడానికి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు శ్రీనివాస శర్మ, ఆనంద్ కుమార్, కేశవ్ రెడ్డి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు సరికొత్త బాట...

- తెలంగాణ ఆర్టీసీ రవాణా రంగంలోకి మహిళా సంఘాలు...
- మండల మహిళా సంఘాల ఆర్టీసీ బస్సును ప్రారంభించిన
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్....




**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాలకు (మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్ హెచ్ జి ఎస్ ) ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపేందుకు ప్రత్యేక రుణ సదుపాయం ప్రభుత్వం కల్పించింది. శంషాబాద్ మహిళా సమాఖ్య ఏపీఎం కొండయ్య, మహిళా అధ్యక్షులు లలితా దేవి, ప్రధాన కార్యదర్శి సరిత ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో 36 లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన టీజీఎస్ ఆర్ టి సి, బస్సును మండల ఎంపీడీవో మున్ని, ఎమ్మార్వో అమరలింగం గౌడ్, ఎంపీ ఓ రమేష్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఈ బస్సును టీజీఆర్టీసీ పరిధిలో నడిపేలా ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని రూపకల్పన చేసింది. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం టీజీఎస్ ఆర్ టి సి,లో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అద్భుతమైన కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్ హెచ్ జి, డిడబ్ల్యూఏ సి ఆర్ ఏ ) కొనుగోలు చేసి ఆర్టీసీకి అందించి ఈ బస్సులను, సంస్థ స్వయంగా లీజుకు తీసుకొని నడుపుతుంది. బస్సు అద్దెను ఆర్టీసీ మహిళా సంఘాలకు చెల్లిస్తుంది. నిర్వహణ బాధ్యత పూర్తిగా డ్రైవర్, ఇంధనం, మెయింటెన్స్ పూర్తి బాధ్యతను ఆర్టీసీ చూసుకుంటుంది. దీని ద్వారా మహిళలకు ఎలాంటి శ్రమ లేకుండా ప్రతి నెల నికరమైన లాభం అందుతుందన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, వ్యాపారవేత్తలుగా, రవాణా రంగంలోనూ భాగస్వాములు కావాలనేదే సీఎం రేవంత్ రెడ్డి సంకల్పమన్నారు. మహిళా సాధికారతకు ఈ పథకం ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని కొనియాడారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు నడపడం వల్ల అటు ఆర్టీసీలో బస్సుల కొరత తీరడంతో పాటు, ఇటు మహిళలకు నిరంతరంగా ఆదాయం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, మహిళా సంఘాల నాయకులు,పార్టీ నాయకులు నిరటి రాజు, వెంకటేష్‌గౌడ్, మహేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, దవణాకర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,దండు ఇస్తారి, సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



## సర్కార్ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలి.!

- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి
- ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నియంత్రణ చర్యలు ఉండాలి
- విద్యాశాఖ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి
- డిఈఓను కలిసిన ఏబీవీపీ జిల్లా నాయకులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సర్దార్ పాఠశాలలో సరైన మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏబీవీపీ నాయకులు డీఈవోను కోరారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి ఏబీవీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, రంగారెడ్డి జిల్లా డిఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సాయి చరణ్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ రేటు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠపరచి, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. యూనిఫాంలు, బస్ ఫీజులు, స్పెషల్ ఫీజులు, పుస్తకాల ఫీజులు మరియు వివిధ బ్రాండ్ల పేర్లతో వేల నుంచి లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఎల్‌కేజీ నుంచి ఉన్నత తరగతుల వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై ప్రభుత్వం కఠిన నియంత్రణ చర్యలు తీసుకొని, విద్యాశాఖ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరపట్నం జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్, ఎబివిపి ఎల్.బి నగర్ జిల్లా కన్వీనర్ వినయ్, నగర కార్యదర్శి నితిన్ పాల్గొనారు..

## నిత్యావసర ధరలను వెంటనే అదుపు చేయాలి

- ...మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నేడు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా
- ..సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకట స్వామి

**బెల్లంపల్లి,మహా:** కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను వెంటనే అదుపులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకట స్వామి పేర్కొన్నారు.మంగళవారం రోజు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కామ్రేడ్ బాశెట్టి గంగారం విజ్ఞాన్ భవన్ లో నిర్వహించిన పత్రిక సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకట స్వామి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను కేంద్రం నియంత్రించాలని కోరుతూ బుదవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.నరేంద్ర మోడీ ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా భారత్ దేశాన్ని పరిపాలిస్తూ భారతదేశ ప్రయోజనాలు కార్మిక పరియోజనాలు కాలరాస్తూ, బహుళ జాతి కంపెనీలకు కార్పొరేషన్లకు తాకట్టు పెడుతూ, దేశ రైతాంగాన్ని విచ్చిన్నం చేస్తూ, సంఘటిత సంఘటిత కార్మికుల ప్రయోజనాలను తుంగలో తొక్కుతూ,విదేశీ కంపెనీలపై ఆధారపడుతూ దేశ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలు చేసే కుతంత్రాలు కుయుక్తులు చేస్తుందని, వ్యాపారీకరణ పేరుతోటి ఆదానీ లకు అంబానీ లకు దేశ ఖనిజ సంపదను ధారదత్తం చేస్తూ, దేశ ఖనిజ సంపదపై పడ్డ కార్పొరేట్ బందిపోట్లకు మోడీ కొమ్ము కాస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజక

వర్గ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం బిజెపి అని, యుద్ధం సాకు తో పెట్రోల్ డీజిల్ వంట గ్యాసు ధరలను పెంచి, సామాన్యులపై భారం మోపుతుందని కేంద్ర ప్రభుత్వ చర్యలను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా తీవ్రంగా ఖండిస్తున్నామని ,ఓ వైపు మనకు గ్యాస్, పెట్రోల్ డీజిల్ అందుబాటులో ఉన్నాయని పత్రికా ప్రకటనలు చేస్తూనే మరోవైపు పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను పెంచుతూనే ఉన్నారని, ఇలా ధరలు పెరగడం వల్ల చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు మూత వేయడం జరుగుతోందని, అధికారంలోకి రాకముందు బిజెపి ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి ఇష్టారీతిన పరిపాలన కొనసాగిస్తూ ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజల తరపున ఆలోచన చేసి ధరలు తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ధరల పెరుగుదల

ను ఖండిస్తు రేపు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా ప్రజాసంఘాల నాయకులు మరియు మేధావులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంత చేయాల్సిందిగా కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, తాండూరు మండల కార్యదర్శి కొండు బానేష్, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, నాయకులు బొంకూరి రామచందర్, కొండు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



## జనావాసాల్లో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాలను వెంటనే తొలగించాలి

**బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్ బాబు & కమీషనర్ తన్నీరు రమేష్**

**బెల్లంపల్లి,మహా:** కనీస నిబంధనలు పాటించకుండా జనావాసాలలో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాలతో పట్టణం ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సంబంధిత స్క్రాప్ దుకాణాలను వెంటనే పట్టణానికి వెలుపలికి తరలించాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్ బాబు తోపాటు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ లు సంయుక్తంగా ఆదేశించారు.బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలోని పలు స్క్రాప్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ నిబంధనలను గాలికి వదిలేసి, కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా జనావాసాల్లో స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేశారని ఆయా వార్డ్ ప్రజల ఫిర్యాదు మేరకు స్క్రాప్ దుకాణాలు తనిఖీ చేశామన్నారు. జనావాసాల్లో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాల వద్ద అపరిశుభ్రత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో వెంటనే స్క్రాప్ దుకాణాలను వేరే చోటికి తరలించాలని దుకాణ యజమానులకు సూచించారు. లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**బల్దియా సీఎంహెచ్చో డా. రాజారెడ్డి, ఎమ్ హెచ్ఓ డా. రాజేష్**

**మహా వరంగల్ కార్పొరేషన్;** లంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు - 2026 పై బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్ లో మంగళవారం అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాస్త్రవేత్త బి. జీమూత వాహన మాట్లాడుతూ, ఘన వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను తడి, పొడి, గృహ ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. అనంతరం బల్దియా ముఖ్య వైద్య, ఆరోగ్య అధికారి డా. బొమ్మన రాజా రెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి డా. రాజేష్, మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏక వినియోగ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా సహజసిద్ధమైన, పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణం, సుస్థిర వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది మున్సిపల్ సిబ్బంది, వార్డ్ జవాన్లు, స్వచ్ఛ భారత్ మిషన్ సిబ్బంది, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (ఆర్‌డబ్ల్యూఏలు) ప్రతినిధులు పాల్గొన్నారు



# పేటీఎంలో నియామకాల జోరు




భారతీయ డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం సరికొత్త పునర్నిర్మాణ వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, మర్చంట్ నెట్‌వర్క్ విస్తరణే లక్ష్యంగా కంపెనీ తన శ్రామిక శక్తిని సుమారు 10 శాతం మేర పెంచుకోవాలని నిర్ణయించింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. రాబోయే తొమ్మిది నెలల్లో (మార్చి 2027 నాటికి) కొత్తగా సుమారు 4,000 మంది ఉద్యోగులను నియమించుకోవడానికి కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేసింది.అయితే, ఒకవైపు భారీ నియామకాలు చేపడుతూనే.. మరోవైపు అంతర్గత పునర్నిర్మాణంలో భాగంగా దాదాపు 400 మంది ఉద్యోగులను (మొత్తం సిబ్బందిలో 1 శాతం) తొలగించేందుకు సంస్థ సిద్ధమవడం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### కీలక అంశాలు..

**భారీ నియామకాలు:** రాబోయే 9 నెలల్లో 4,000 మంది కొత్త సిబ్బంది రిక్రూట్‌మెంట్. ఇప్పటికే గత రెండు నెలల్లో 800 మందికి పైగా నియామకం పూర్తి.
**ఉద్యోగాల కోత:** వార్షిక పనితీరు మదింపు ఆధారంగా ఎంపిక చేసిన విభాగాల్లో 400 మంది తొలగింపు.
**ప్రస్తుత ఉద్యోగుల సంఖ్య:** ప్రస్తుతం కంపెనీలో 40,000 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నూతన నియామకాలతో ఈ సంఖ్య మరింత పెరగనుంది.
**ప్రధాన దృష్టి:** సీనియర్ లీడర్‌షిప్ పాత్రలతో పాటు.. ప్రొడక్ట్, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల బలోపేతం.

### సరికొత్త ప్లాన్

2010లో విజయ్ శేఖర్ శర్మ స్థాపించిన పేటీఎం మొబైల్ రీఛార్జ్‌లతో ప్రారంభమై 2016 నోట్ల రద్దు తర్వాత దేశీయ ఫిన్‌టెక్ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. అయితే, గత రెండేళ్ల క్రితం పేటీఎం బ్యాంకింగ్ విభాగంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ కఠిన నిబంధనలు విధించడం, ఆపై లైసెన్స్ రద్దు చేయడంతో కంపెనీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో దాదాపు 4,500 మందికి పైగా సిబ్బందిని తగ్గించుకోవాల్సి వచ్చింది. ఆ నియంత్రణ సవాళ్ల నుంచి కోలుకున్న పేటీఎం వరుసగా నాలుగు త్రైమాసికాల్లో లాభాలను నమోదు చేస్తూ మళ్లీ ట్రాక్‌లోకి వచ్చింది. ఇప్పుడు కంపెనీకి ఉన్న రిజిస్టర్డ్ వినియోగదారులను కేవలం చెల్లింపులకే పరిమితం చేయకుండా.. రుణాలు, పెట్టుబడి ఉత్పత్తులు, ఇతర ఆర్థిక సేవలను విస్తృతంగా అందించడంపై దృష్టి సారించారు.

# గోల్డ్ లోన్.. కష్టాలు!

**సాధారణ, మధ్య తరగతి కుటుంబీకులకు బంగారమంటే కేవలం అలంకరణే కాదు.. ఆపద నుంచి గట్టెక్కించేది కూడా. వ్యక్తిగత, వ్యాపార, తదితర స్వల్పకాలిక, దీర్ఘకాలిక అవసరాల్లో తక్షణమే పొందగలిగేది పసిడి రుణం మాత్రమే. మొన్నటి వరకు బ్యాంకుల్లో చాలా సులభంగా పొందే గోల్డ్ లోన్ ప్రస్తుతం కఠినతరంగా మారింది. ఆర్‌బీఐ తాజాగా తీసుకొచ్చిన నిబంధనల కారణంగా బ్యాంకుల్లో బంగారు రుణాలు తీసుకున్న వారు కొత్త నిబంధనలతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.**

### 'ప్రైవేటు'ను ఆశ్రయిస్తూ..

రుణాలను అసలు, వడ్డీ చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని బ్యాంకర్లు చెబుతుండడంతో కొందరు రుణ గ్రహీతలు రెన్యూవల్ కోసం నానా అవస్థలు పడుతున్నారు. రెన్యూవల్ కోసం రూ.లక్షలు అప్పులు పుట్టక.. చివరకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీరు రెండు, మూడు రోజుల్లోనే రూ.2 చొప్పున వడ్డీ చెల్లిస్తేనే ఇస్తామని చెబుతున్నా.. చేసేదిలేక రుణగ్రస్తులు వడ్డీకి డబ్బులు తీసుకొచ్చి తీవ్రంగా నష్టపోతున్నారు.

### నూతన నిబంధనలు ఇలా..

బంగారం రుణాలను అగ్రి లోన్స్, నాన్ అగ్రి లోన్స్ అంటూ రెండు భాగాలుగా విభజించారు. రూ.2.25 లక్షల రుణం తీసుకునే వారికి నిబంధనలు కాస్త సరళతరంగా ఉండగా.. అంతకు మించి అయితే రుణం పొందలేని పరిస్థితి ఉంది. వ్యవసాయదారుడు రుణం తీసుకోవాలంటే పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు తహసీల్దార్ ధ్రువీకరించిన



ఆదాయ సర్టిఫికెట్, భూమికి చెందిన 1బీ, పశువుల వివరాలు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకానికి సంబంధించిన రశీదులు సమర్పించాల్సి ఉంటుంది. ఇక నాన్ అగ్రి రుణం తీసుకునే వారికి ఐటీఆర్, సిబిల్, ఆదాయ ధ్రువీకరణ చేసుకున్నాకే రుణం మంజూరు చేస్తారు. గతంలో డిఫాల్టర్‌గా ఉండి సెటిల్మెంట్ చేసుకున్న వారికి బంగారంపై రుణాలు ఇవ్వబడవు. ఆదాయాన్ని బట్టి ఒక్కరు మూడు నుంచి ఐదు రుణాలను మాత్రమే తీసుకోవడానికి అర్హులు. ఆదాయ వనరులు, ఆదాయం లేని వారు రుణం పొందడానికి అనర్హులు. రెన్యూవల్లో మాత్రం నిబంధనలను సడలించింది. ఏడాదిలోపు రుణాన్ని రెన్యూవల్ చేసుకునే వారికి వడ్డీ మాత్రమే చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటు కేవలం మూడు పర్యాయాలు మాత్రమే వర్తించనుంది. అలాగే బంగారం రుణాల మంజూరు ప్రక్రియలో రుణగ్రహీత నిధులను ఎందుకోసం ఖర్చు చేయనున్నారనే విషయంపై ఆరా తీయాలని బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశించినట్లు సమాచార. అంతేకాక రుణగ్రహీతల బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలని, తాకట్టు పెట్టిన బంగారం వాస్తవ హక్కుదారు ఎవరనేదీ తెలుసుకోవాలని నిర్దేశించినట్లు తెలిసింది. పసిడి రుణాల వ్యాపారంలో అనైతిక వ్యవహారాలకు చెక్ పెట్టడంతో పాటు ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి భంగం కలగకుండా చూడటమే ఆర్బీఐ ఉద్దేశంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### భారీగా రుణాల చార్జీలు..

వివిధ బ్యాంకులు బంగారం రుణాల్లో భారీగా చార్జీలు పెంచింది. గతంలో రూ.3 లక్షల వరకు ఉచితంగా ఉండగా.. రూ.3 లక్షలు పైన నామినల్ చార్జీలు తీసుకునే వారు. అయితే ఇటీవల బంగారం రుణాలు తీసుకునే వారిపై చార్జీల మోత మోగిస్తోంది. ప్రతి రూ.లక్ష రుణానికి అప్రైజర్ చార్జితో పాటు సర్వీస్ చార్జి అంటూ సుమారు రూ.900 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా రూ.5 లక్షల వరకు రుణానికి అయితే గోల్డ్ అప్రైజర్‌కు రూ. 590, ప్రాసెసింగ్ చార్జిలు రూ. 295లు వసూలు చేస్తుండగా.. రూ.5 లక్షల పైన రుణానికి అయితే గోల్డ్ అప్రైజర్‌కు రూ. 708, ప్రాసెసింగ్ చార్జిలు రూ. 590 లు వసూలు చేస్తున్నారు. కాగా, బ్యాంకుల వారీగా చార్జీలు ఉన్నాయి. ఇకనైనా బ్యాంకర్లు వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలు రెన్యూవల్ చేయాలని రైతులు కోరుతున్నారు.

# క్యాపిటల్ మార్కెట్లపై గురి



దేశీయంగా కుటుంబ పెట్టుబడులలో క్యాపిటల్ మార్కెట్లకు ప్రాధాన్యం పెరుగుతున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. పొదుపు సొమ్ము మదుపు చేసేందుకు కీలక మార్గంగా భావిస్తున్నట్లు తెలియజేశారు. సంపద సృష్టిలో భాగమవుతున్నట్లు పేర్కొన్నారు. ఇది వ్యవస్థాగత మార్పును ప్రతిబింబిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. తద్వారా భారతీయులు దేశ వృద్ధిలో ఇన్వెస్ట్ చేయడంతోపాటు, భాగస్వాములవుతున్నట్లు వివరించారు. వెరసి కుటుంబాల పొదుపు సొమ్మును ఇన్వెస్ట్ చేసేందుకు క్యాపిటల్ మార్కెట్లు కీలక అవకాశంగా మారుతున్నట్లు 2026 ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఇండియా ఇన్వెస్టర్ సదస్సు సందర్భంగా తెలియజేశారు. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసు(పీఎంఎస్) నిబంధనలపై విస్తారిత చర్చలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. త్వరలో చర్చాపత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలియజేశారు.

# ఇన్నోవా క్రిస్టా.. సరికొత్తగా



టయోటా ఇన్నోవా క్రిస్టా సరికొత్త లగ్జరీ హంగులతో కస్టమర్ల ముందుకు వచ్చింది. కొత్త డిజైన్ అప్‌డేట్లు, ఆధునిక ఫీచర్లు, మరింత మెరుగైన క్యాబిన్ అనుభవంతో మల్టీ-పర్పస్ వెహికల్ (ఎంపీవీ) విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధమైంది. అయితే, ఇంజిన్, పనితీరులో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. దీని ఎక్స్-షోరూమ్ ధర రూ. 19.72 లక్షల నుంచి ప్రారంభమవుతోంది. టయోటా డీలర్‌షిప్‌లో, సంస్థ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఇప్పటికే అన్ని మోడల్స్ ఉన్న టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, స్మార్ట్ ఫోన్ కనెక్టివిటీ, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, స్టీరింగ్ మౌంటెడ్ కంట్రోల్స్, వెనుక ఏసీ వెంట్స్, మొబైల్ ఛార్జర్ లాంటి ఫీచర్లున్నాయి. సుదూర ప్రయాణాల్లో సౌకర్యం, మంచి పనితీరు, బలమైన డీజిల్ ఇంజిన్ కారణంగా ఇన్నోవా క్రిస్టాకు మంచి డిమాండ్ ఉంది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం ఈ ఎంపీవీ లీటరుకు 15 కిలోమీటర్ల వరకు మైలేజ్ అందిస్తుంది.

# స్వల్ప లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. ఈరోజు ఉదయం 10:40 సమయానికి నిఫ్టీ30 పాయింట్లు పెరిగి 23,152 వద్దకు చేరింది. సెన్సెక్స్67 పాయింట్లు ఎగబాకి 73,588 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్(USD Index) 99.95. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 93.4 డాలర్లు.యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.55 శాతానికి చేరాయి.గడిచిన సెషన్‌లో యూఎస్ ఎస్ అండ్ పీ 0.3 శాతం పెరిగింది. నాస్‌డాక్ 0.86 శాతం పుంజుకుంది.




# రష్యా చమురు కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులు



రష్యా చమురు టార్గెట్‌గా ఉక్రెయిన్ దాడులు చేసింది. క్రాస్నోడార్ క్రాయ్, క్రిమియాలోని చమురు క్షేత్రాలపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ తెలిపారు. ఈ కాంప్లెక్స్ దక్షిణ రష్యాలో చమురు, పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు సంబంధించిన అతిపెద్ద కేంద్రాలలో ఒకటి. మరోవైపు రష్యాతో పాటు, రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతాలపైనా డ్రోన్లతో దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా.. 18 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు మాస్కో ప్రాంతం, పశ్చిమ, నైరుతి రష్యా, రష్యా ఆక్రమిత క్రిమియా, నల్లసముద్రం, అజోవ్ సముద్రాలపై వచ్చిన 310 ఉక్రెయిన్ డ్రోన్లను తమ దళాలు కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదే సమయంలో రష్యా 155 డ్రోన్లతో ఉక్రెయిన్‌ను లక్ష్యంగా చేసుకోగా.. వాటిలో 124 డ్రోన్లను ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేసాయని ఆ దేశ వైమానిక దళం పేర్కొంది.

# ఎలుగుబంటి స్వైరవిహారం.. 100 పాఠశాలలు మూసివేత!

ఉత్సునోమియా: జపాన్‌లోని ఒక ప్రముఖ నగరంలో ఎలుగుబంటి సంచారం స్థానికులను వణకిస్తోంది. గత మూడు రోజులుగా వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్న ఒక అడవి ఎలుగుబంటి, తీవ్ర భయాందోళనలను సృష్టించింది. ఈ అత్యవసర పరిస్థితి కారణంగా అధికారులు రంగంలోకి దిగి, నగరంలోని దాదాపు 100 పాఠశాలలను తక్షణమే మూసివేయాలని ఆదేశించారు. వందలాది మంది పోలీసులు, వేటగాళ్లు ఆ వన్యప్రాణిని పట్టుకోవడానికి తీవ్రంగా గాలిస్తున్నారు.

### జపాన్ నగరంలో హై అలర్ట్

టోక్యోకు ఉత్తరాన ఉన్న ఉత్సునోమియా నగరంలో శనివారం నుండి ఎలుగుబంటి సంచారానికి సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం సోమవారం నాడు 94 ప్రభుత్వ ప్రాథమిక, జూనియర్ హైస్కూళ్లను మూసివేసింది. ఎలుగుబంటి తిరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని, బయటకు రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### మార్కెట్లు, పాఠశాలల్లో కలకలం

పట్టణ కేంద్రానికి ఉత్తరాన శనివారం ఉదయం ఎలుగుబంటి మొదటిసారిగా కనిపించింది. ఆ తర్వాత అది నివాస ప్రాంతాలు, ఒక షాపింగ్ ఆర్కేడ్, ఆపై ఒక పార్క్, హైస్కూల్ పరిసరాల్లో సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. చివరిగా సోమవారం ఉదయం ఒక హోల్‌సేల్ మార్కెట్ సమీపంలో ఎలుగుబంటి కనిపించడంతో నగరవ్యాప్తంగా ఆందోళన మరింత పెరిగింది. అయితే ఇవన్నీ ఒకే ఎలుగుబంటికి సంబంధించిన ఆనవాళ్లా లేదా ఇంకా ఉన్నాయా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

### పెరుగుతున్న ఎలుగుబంట్ల దాడులు

జపాన్‌లో ఇటీవలి కాలంలో అడవి ఎలుగుబంట్లు జనావాసాల్లోకి రావడం, దాడులకు తెగబడటం గణనీయంగా పెరిగింది. గత ఏడాది దేశవ్యాప్తంగా ఎలుగుబంట్ల దాడుల కారణంగా 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆకలితో ఇవి నగరాలపై పడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది మార్చి నాటికి జపాన్ వ్యాప్తంగా 50 వేలకుపైగా



ఎలుగుబంట్ల సంచార కేసులు నమోదయ్యాయి. 5.1 లక్షల జనాభా ఉన్న ఉత్సునోమియా నగరం ఎలుగుబంట్లు తిరుగుతుంటం స్థానికులకు ఆందోళనకు గురిచేస్తోంది.

# హర్మూజ్ జలసంధి దగ్గర టెన్షన్ టెన్షన్..

హర్మూజ్ జలసంధి దగ్గర యూఎస్ ఆర్మీ అపాచీ హెలికాప్టర్ కూలిపోయిందని.. అందులో ఇద్దరు సిబ్బందిని దళాలు సురక్షితంగా కాపాడినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. అయితే, హెలికాప్టర్ కూలిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. హెలికాప్టర్‌పై ఇరాన్ దళాలు దాడి చేశాయా? ఏదైనా సాంకేతిక లోపం తలెత్తిందా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. హర్మూజ్ జలసంధి గుండా వాణిజ్య రవాణాను ఇరాన్ సమర్థవంతంగా అడ్డుకోవడాన్ని నిరోధించేందుకు అమెరికా దళాలు సాగిస్తున్న కార్యకలాపాల సమయంలోనే ఈ అపాచీ ప్రమాదం జరిగింది. ఈ ఆపరేషన్లలో భాగంగా యూఎస్ మిలిటరీ అపాచీ హెలికాప్టర్లతో పాటు MQ9 రీపర్ డ్రోన్లు, F/A18, F35 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను రంగంలోకి దించింది. ఫిబ్రవరి 28న ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్ దాదాపు 30 MQ9 రీపర్ డ్రోన్లను కూల్చివేసిందని, అలాగే శత్రువుల దాడి లేక పొరపాటున జరిగిన కాల్పుల వల్ల పలు యుఎస్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా ధ్వంసమయ్యాయని అంతర్జాతీయ కథనాలు చెబుతున్నాయి. ఈ ఘటన కూడా నిజమని తేలితే.. ఈ ఘర్షణల్లో యుఎస్ కోల్పోయిన మొదటి అపాచీ హెలికాప్టర్ ఇదే అవుతుంది.'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' ఆపరేషన్ కింద హార్మూజ్ జలసంధి, పరిసర జలాల్లో వాణిజ్య నౌకలకు రక్షణగా యూఎస్ నేవీ వెళ్లేందుకు ముందు... సెంట్రల్ కమాండ్ ఫోర్స్



కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ అక్కడ వైమానిక పర్యటన నిర్వహించిన ఫోటోలను గత నెలలో సెంట్రల్ కమాండ్ విడుదల చేసింది. AH64 అపాచీ హెలికాప్టర్.. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న అత్యంత శక్తివంతమైన యుద్ధ విమానాలలో ఒకటి. వ్యూహాత్మక రవాణా మార్గాలను పర్యవేక్షించడానికి, చిన్న బోట్ల ద్వారా జరిగే దాడులను అడ్డుకోవడానికి, శత్రు డ్రోన్లను కూల్చివేయడానికి ఈ హెలికాప్టర్లను ఉపయోగిస్తారు.హార్మూజ్ జలసంధి గుండా సముద్ర రవాణాను పునరుద్ధరించడానికి వాషింగ్టన్, టెహ్రాన్ దేశాల మధ్య పలుసార్లు చర్చలు జరుగుతున్నప్పటికీ... ఆ ప్రాంతంలో యూఎస్ సైన్యం తన దూకుడు ప్రదర్శిస్తోంది. ఇందులో భాగంగానే హార్మూజ్ జలసంధి.. పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ నియంత్రణలో ఉన్న దీవులకు అత్యంత సమీపంలో అపాచీ హెలికాప్టర్లు ఎక్కువగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇరాన్ దిగ్బంధనానికి ప్రతిస్పందనగా అమెరికా..ఏప్రిల్ నెలలో ఇరాన్ ఓడరేవులకు ప్రవేశ పరిమితులను విధించిందని కూడా ది న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

# ఇది ప్రేమికుల గొడవ లాంటిదే!

***నలభై ఏళ్ల స్నేహం.. ఒకరి విజయాలను మరొకరు బహిరంగంగా కొనియాడుకునే అనుబంధం.. కానీ ఇరాన్ విషయంలో మాత్రం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మధ్య విభేదాల మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌పై మరిన్ని దాడులకు సిద్ధమవుతున్న నెతన్యాహూను ట్రంప్ పదేపదే అప్రమత్తం(వార్నింగ్) చేస్తున్నారన్న వార్తలు వెలువడగా.. దీనిని ఇజ్రాయెల్ రాయబారి యెచియెల్ లీటర్ మాత్రం 'ప్రేమికుల మధ్య వచ్చే చిన్నపాటి గొడవ'గా అభివర్ణించడం ఆసక్తి రేపుతోంది.***

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరదించుతూ ఇరాన్.. ఇజ్రాయెల్‌పై తాము చేపట్టిన సైనిక చర్యలను తక్షణమే నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరు దేశాలకూ చేసిన శాంతి విజ్ఞప్తిపై స్పందించిన ఇరాన్.. కాల్పుల విరమణ నిర్ణయం తీసుకున్నట్టు ఫార్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తే వాషింగ్టన్ మద్దతును కోల్పోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆప్తమిత్రుడు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును హెచ్చరించిన తర్వాతే ఇజ్రాయెల్ తన దాడులను నిలిపివేసినట్లు అంతర్జాతీయ మీడియా చెబుతోంది. అయితే, యెచియెల్ లీటర్ ఈ కథనాలను తోసిపుచ్చారు. ఇద్దరు నేతల మధ్య చర్చలు పరస్పర సహకారంతో జరిగాయని.. మీడియా.. తప్పుదోవ పట్టించేలా కథనాలను అల్లుతుందంటూ ఆరోపించారు. ''వారి మధ్య దాదాపు



40 ఏళ్ల నాటి లోతైన స్నేహం ఉంది. కొన్నిసార్లు ప్రేమికుల మధ్య చిన్నపాటి ఘర్షణలు (lovers' spat) జరుగుతుంటాయి, అలాగే కొన్నిసార్లు వారి సంభాషణల్లో వాతావరణం కాస్త వేడెక్కుతుందని ఫాక్స్ న్యూస్‌తో లీటర్ వ్యాఖ్యానించారు. ట్రంప్ అభ్యర్థన మేరకు ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో తీవ్రతను తగ్గించాలని ఇజ్రాయెల్ ప్రధాని నిర్ణయించుకున్నప్పటికీ, తమ దేశంపైకి వచ్చే బాలిస్టిక్ క్షిపణులను స్పందించకుండా ఇజ్రాయెల్ ఊరికే భరించలేదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు కూడా అర్థం చేసుకున్నారని ఇజ్రాయెల్ దౌత్యవేత్త పేర్కొన్నారు. చాలా వరకు మేము అమెరికాఇజ్రాయెల్ మధ్య చాలా సన్నిహిత, ఉమ్మడి సహకారంతో ముందుకు సాగుతున్నాము. మా మధ్య అద్భుతమైన అవగాహన ఉందన్నారు. మరోవైపు, నెతన్యాహుపై ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అంతకుముందు ఇజ్రాయెల్ఇరాన్ రెండు దేశాలూ దాడులు ఆపాలని ఆయన పిలుపునిచ్చారు. అజ్ఞానం, మూర్ఖత్వం అడ్డురాకపోతే శాంతి దిశగా తుది చర్చలు ముందుకు సాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని మీడియాతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే పూర్తి హక్కు ఉందని.. అవసరమైన విధంగానే చర్యలు తీసుకుంటున్నామంటూ తాను ట్రంప్‌నకు స్పష్టం చేసినట్లు తెలిపారు.



# బాక్సాఫీస్ వద్ద పెద్ది దూకుడు.. 5 రోజుల్లోనే రూ. 315 కోట్లు!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన మోస్ట్ అవేటెడ్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మొదటి ఆట నుండే బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుని రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఛాంపియన్‌గా నిలిచిన 'పెద్ది' చిత్రం కేవలం 5 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 315 కోట్లకు పైగా అద్భుతమైన గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత వేగంగా రూ. 300 కోట్ల క్లబ్‌లో చేరిన సోలో చిత్రంగా 'పెద్ది' సరికొత్త చరిత్ర లిఖించింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథా నాయకిగా నటించగా, కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ ఒక కీలక పాత్రలో మెరిశారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం మరియు రత్నవేలు సినిమాటోగ్రఫీ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు వంటి దిగ్గజ నటులు ముఖ్య పాత్రలు పోషించారు.




# ఏడేళ్లుగా బాలీవుడ్‌లో సినిమా లేదు..

## అయినా టాప్ హీరోయిన్‌గా ప్రియాంక రికార్డు

భారతీయ సినీ పరిశ్రమలో స్టార్‌డమ్‌కు కొత్త నిర్వచనం చెబుతున్న పేరు ప్రియాంక చోప్రా. గత ఏడేళ్లుగా బాలీవుడ్‌లో ఒక్క సినిమా కూడా విడుదల కాకపోయినా, ప్రపంచవ్యాప్తంగా తన బ్రాండ్ విలువను నిలబెట్టుకుంటూ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. తాజాగా విడుదలైన ఫార్చ్యూన్ ఇండియా-ఇంటర్‌బ్రాండ్ 'మోస్ట్ వాల్యూబుల్ సెలబ్రిటీస్' జాబితాలో ప్రియాంక చోప్రా మూడో స్థానంలో నిలిచి మరోసారి తన గ్లోబల్ క్రేజ్‌ను చాటుకుంది.ఈ ప్రతిష్టాత్మక జాబితాలో భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ తొలి స్థానాన్ని దక్కించుకోగా, బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ రెండో స్థానంలో నిలిచారు. వీరి తర్వాత మూడో స్థానాన్ని దక్కించుకుంది ప్రియాంక చోప్రా. టాప్ 3లో చోటు దక్కించుకున్న ఏకైక మహిళా సెలబ్రిటీగా ప్రత్యేక గుర్తింపు పొందింది.ప్రియాంక చోప్రా చివరిసారిగా బాలీవుడ్‌లో నటించిన చిత్రం 'ది స్కై ఈజ్ పింక్'. ఈ సినిమా 2019లో విడుదలైంది. ఆ తర్వాత ఆమె పూర్తిగా అంతర్జాతీయ ప్రాజెక్టులపై దృష్టి పెట్టారు. అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమాన వర్గం, ప్రముఖ బ్రాండ్లతో ఉన్న అనుబంధం, సోషల్ మీడియా ప్రభావం కారణంగా ఆమె బ్రాండ్ విలువ ఏమాత్రం తగ్గలేదని తాజా అధ్యయనం స్పష్టం చేసింది. జాబితాలో నాలుగో స్థానంలో భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని నిలవగా, ఐదో స్థానంలో రణ్‌వీర్ సింగ్, ఆరవ స్థానంలో అక్షయ్ కుమార్, ఏడో స్థానంలో అమితాబ్ బచ్చన్, ఎనిమిదో స్థానంలో సచిన్ టెండూల్కర్, తొమ్మిదో స్థానంలో ఆలియా భట్ చోటు దక్కించుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమ నుంచి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పదో స్థానంలో నిలిచి టాలీవుడ్ సత్తాను మరోసారి నిరూపించారు.ఈ ర్యాంకింగ్స్‌ను కేవలం సంపాదన లేదా సోషల్ మీడియా ఫాలోవర్ల ఆధారంగా నిర్ణయించలేదు. సెలబ్రిటీల మార్కెట్ ప్రభావం, ప్రజల్లో ఉన్న నమ్మకం, బ్రాండ్ ఎంగేజ్‌మెంట్, సామాజిక బాధ్యత, వ్యక్తిగత ఇమేజ్, డిజిటల్ ప్రభావం వంటి అనేక అంశాలను విశ్లేషించి ఈ జాబితాను రూపొందించారు. సెలబ్రిటీ వ్యక్తిత్వాన్ని ఒక ఆర్థిక ఆస్తిగా పరిగణించి ఈ విలువలను అంచనా వేశారు. మిస్ వరల్డ్ 2000 టైటిల్ గెలుచుకున్న తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టిన ప్రియాంక చోప్రా, 'ఐత్రాజ్', 'ఫ్యాషన్', 'డాన్', 'క్రిష్', 'మేరీ కోమ్', 'బర్ఫీ', 'బాజీరావ్ మస్తానీ' వంటి చిత్రాలతో అగ్ర నటిగా ఎదిగారు. 'ఫ్యాషన్' చిత్రానికి గాను జాతీయ ఉత్తమ నటి అవార్డును కూడా అందుకున్నారు. కాగా, ప్రియాంక చోప్రా త్వరలోనే తెలుగు ప్రేక్షకులను కూడా అలరించనున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మహేష్ బాబు ప్రతిష్టాత్మక అడ్వెంచర్ ప్రాజెక్ట్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తుంది.

# పెద్దిపై అల్లు అర్జున్ ప్రశంసల జల్లు..

**రామ్ చరణ్ నటనకు ఫిదా, బుచ్చిబాబుకు ప్రత్యేక అభినందనలు!**





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన తాజా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతున్న వేళ, ఈ సినిమాపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్పందించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సినిమా చూసిన అనంతరం సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్న అల్లు అర్జున్, రామ్ చరణ్ నటనతో పాటు చిత్ర బృందం పనితీరుపై ప్రశంసల వర్షం కురిపించారు.'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించిన అల్లు అర్జున్, "నిన్న రాత్రి 'పెద్ది' సినిమా చూశాను. రామ్ చరణ్ అద్భుతమైన నటన కనబరిచాడు. ముఖ్యంగా ఆయన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ అసాధారణంగా ఉంది. పాత్రలో పూర్తిగా లీనమైరా అండ్ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. డ్యాన్స్ మూమెంట్స్ కూడా ఎంతో గ్రేస్‌ఫుల్‌గా ఉన్నాయి. ప్రతి అంశంలోనూ చరణ్ తన ప్రతిభను నిరూపించాడు. అతడిని చూస్తే నిజంగా గర్వంగా అనిపించింది. ఈ ప్రశంసలకు పూర్తిగా అర్హుడు" అంటూ కొనియాడారు.

రామ్ చరణ్‌తో పాటు సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు నటనను కూడా అల్లు అర్జున్ ప్రత్యేకంగా ప్రశంసించారు. జగపతి బాబు గారు, ఇతర నటీనటులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. హీరోయిన్ జాన్వీ కపూర్‌కి కూడా అభినందనలు. సినిమాలో పనిచేసిన సాంకేతిక నిపుణులు, నిర్మాతలు అందరికీ శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. అంతేకాకుండా దర్శకుడు బుచ్చిబాబు సానాపై కూడా ప్రశంసలు కురిపించారు. రామ్ చరణ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన బుచ్చిబాబు సానాకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ విజయానికి కారణమైన మొత్తం టీమ్‌కు హృదయపూర్వక అభినందనలు అంటూ తన ట్వీట్‌ను ముగించారు.

ఇటీవల 'పెద్ది' విడుదలకు ముందు థియేటర్ల అద్దె విధానం, రెవెన్యూ షేరింగ్ అంశాలపై చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో పరిశ్రమలోని పలువురు నిర్మాతలు ఈ సినిమాకు మద్దతు ప్రకటించినప్పటికీ, విడుదల అనంతరం స్టార్ హీరోల నుంచి పెద్దగా స్పందనలు రాలేదు. ఈ నేపథ్యంలో 'పెద్ది'పై బహిరంగంగా స్పందించి ప్రశంసించిన తొలి అగ్ర హీరోగా అల్లు అర్జున్ నిలవడం విశేషంగా మారింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది'లో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, జగపతి బాబు, శివరాజ్‌కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో సామాజిక సందేశంతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటోంది.

# ఇండియాలో నోలన్ 'ది ఒడిస్సీ' మేనియా!






ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ది ఒడిస్సీ' అడ్వాన్స్ బుకింగ్స్ ఇండియాలో రికార్డు స్థాయి ధరలతో ప్రారంభమయ్యింది. జూన్ 8న దేశవ్యాప్తంగా ఐమాక్స్ షోల కోసం బుకింగ్స్ ఓపెన్ చేయగా, ఈ సినిమా టికెట్ల ధరలు చూసి సినీ ప్రియులు షాక్‌కు గురవుతున్నారు. ముంబై, పూణే వంటి మెట్రో నగరాల్లో ప్రీమియం సీట్ల ధరలు రూ. 3,000 వరకు ఉండగా, ముంబైలో కొన్ని లేట్ నైట్ షోల టికెట్ ధర ఏకంగా రూ. 3,300కు చేరింది. భారతదేశంలో ప్రస్తుతం విక్రయించబడుతున్న అత్యంత ఖరీదైన సినిమా టికెట్లలో ఇవి ఒకటిగా నిలిచాయి. అయితే ఈ భారీ ధరలు నోలన్ క్రేజ్‌ను ఏమాత్రం తగ్గించలేకపోయాయి. టికెట్ల ధరలు అంత ఎక్కువగా ఉన్నప్పటికీ, బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే పలు షోలు పూర్తిగా అమ్ముడైపోయాయి. కాగా, నగరాల వారీగా టికెట్ ధరలలో ఉన్న భారీ వ్యత్యాసం ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఒకే సినిమా అనుభవానికి నగరాన్ని బట్టి, షో టైమింగ్‌ను బట్టి ఇంత తేడా ఎందుకు ఉందంటూ అభిమానులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమాను పూర్తిగా ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరించినప్పటికీ, భారతదేశంలోని చాలా థియేటర్లలో నోలన్ సినిమాలకు ప్రత్యేకమైన 'ఐమాక్స్ 70ఎమ్ఎమ్' (IMAX 70mm) ఫార్మాట్‌లో ప్రదర్శించే సాంకేతికత లేదనే విషయాన్ని కూడా కొందరు గుర్తు చేస్తున్నారు.మరోవైపు ఈ అడ్వాన్స్ బుకింగ్స్ ట్రెండ్‌పై ఎక్స్‌లో అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. పూణే ఐమాక్స్‌లో రూ. 3,000 ధర పలకడం భారతదేశంలోనే అత్యధిక టికెట్ ధర అని, భారత్‌లో క్రిస్టోఫర్ నోలన్ ఒక బ్రాండ్ అని ఒకరు పోస్ట్ చేయగా, సినిమా ప్రమోషన్ల కోసం దర్శకుడు కానీ, నటీనటులు కానీ ఇండియాకు రాకపోయినా కేవలం నోలన్ అనే పేరుతోనే నిమిషాల్లో టికెట్లు అమ్ముడైపోవడం ఆయన లెగసీకి నిదర్శనమని మరొకరు పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత క్రిస్టోఫర్ నోలన్ రాసి, దర్శకత్వం వహించిన 'ది ఒడిస్సీ' చిత్రం హోమర్ రాసిన పురాణ గాథ ఆధారంగా రూపొందింది. ట్రాయ్ పతనం తర్వాత ఇథాకా రాజు ఒడిస్సియస్ తన స్వగృహానికి చేరుకోవడానికి చేసిన ప్రమాదకరమైన ప్రయాణం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఇందులో ఒడిస్సియస్‌గా మాట్ డామన్, టెలిమాకస్‌గా టామ్ హాలండ్, పెనెలోప్‌గా అన్నే హాత్వే నటిస్తున్నారు.




# 'డీజే టిల్లు' దర్శకుడి కొత్త చిత్రం..

## ఆకట్టుకుంటున్న అనుమానపక్షి టీజర్!

'డీజే టిల్లు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు విమల్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సరికొత్త చిత్రం 'అనుమానపక్షి'. 'ఎ సైక్ ఖాస్టిక్ కామెడీ' (AnumanaPakshi - A Psych Chaotic Comedy) అనేది ఉపశీర్షిక. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న జూలై 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రంలో రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ప్రిన్స్ సిసిల్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, అజయ్, మస్త్ అలీ (సలీం ఫేకు) వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో మెరవనున్నారు. దర్శకుడు విమల్ కృష్ణ తన మార్క్ కామెడీ నరేషన్‌తో ఈ కథను ఎంతో క్రేజీగా మలిచినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. టీజర్‌లో హీరో ప్రతి విషయాన్ని భూతద్దంలో చూస్తూ అనుమానం పెంచుకుని దానివలన ఎదురైన పరిణామాలు ఏంటి అనేది సినిమా కథ అని తెలుస్తుంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక, స్నేహ రాజేష్ జగ్తియాని, విహాన్ దాండ్, శ్రీచరణ్ మర్నేని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించగా, భరత్ లక్ష్మిపతి కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. డీజే టిల్లు లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ నుండి వస్తున్న సినిమా కావడంతో, జూలై 10న విడుదల కాబోతున్న 'అనుమానపక్షి' బాక్సాఫీస్ వద్ద మరో పెద్ద సక్సెస్ అందుకోవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అనుకుంటున్నాయి.

# నిత్యా మీనన్ కొత్త సినిమా..

## అడ్వాన్స్ తక్కువే.. లాభాల్లో వాటా!



దక్షిణాది నటీమణుల్లో నటి నిత్యామీనన్ ప్రత్యేకమనే చెప్పాలి. చాలా ముక్కుసూటి మనిషి. మనసులో అనిపించింది చెప్పే భామ. పాత్రల్లో జీవించే నటీమణి. కాస్త బొద్దుగా ఉన్నా, దాన్నే అలంకారంగా భావించే బ్యూటీ. కథా పాత్రలు నచ్చితేనే నటించడానికి అంగీకరించే నటి. విమర్శలను అస్సలు పట్టించుకోని సంచలన నటి. సెలెక్టివ్ చేసే నిత్యామీనన్ ఇటీవల తమిళంలో నటించిన తలైవన్ తలైవి చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఆ తరువాత మరో చిత్రం కమిట్ కానీ ఈమెను తాజాగా ఒక కథ తెగ నచ్చేసిందట. దీంతో ఆ చిత్రంలో నటించడానికి పచ్చజెండా ఊపేసినట్లు తాజా సమాచారం. అవును ఇంతకు ముందు యామిరుక్క భయమే, కాట్టేరి, కవల్ వేండామ్ వంటి చిత్రాలను తెరకెక్కించిన డీకే తాజాగా తన కొత్త చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉమెన్ సెంట్రిక్ కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రంలో నటి నిత్యామీనన్ ప్రధాన పాత్రను పోషించనున్నారు. ఈమెకు దర్శకుడు కథ చెప్పగానే తెగ నచ్చేసిందనీ దీంతో ఆమె వెంటనే నటించడానికి అంగీకరించినట్లు సమాచారం. విశేషం ఏమిటంటే ఈ చిత్రంలో నటించడానికి చిన్న మొత్తాన్నే అడ్వాన్స్‌గా తీసుకున్నారని, మిగిలింది చిత్రానికి వచ్చే లాభాల్లో షేర్‌ను తీసుకోవడానికి నిత్యామీనన్ అంగీకరించినట్లు సమాచారం. చాలాకాలంగా నిర్మాతలు కోరుకుంటోంది ఇదే కావడంతో.. ఈ విషయంలో పలువురికి నిత్య మీనన్ మార్గదర్శిగా నిలుస్తారని చెప్పవచ్చు. కాగా ఈమె నటించనున్న తాజా చిత్రానికి సంబంధించి న పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా, వెల్లడించే అయ్యే అవకాశం ఉంది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com